teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 04 | సంచిక : 38 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | శనివారం | 12 జూలై 2025 | పేజీలు : 08 | వెల ‘5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad.

## ఒక దేశం ఒకే ఎన్నికపై పార్లమెంటరీ కమిటీ సమావేశం

ఏకకాల ఎన్నికల అంశంపై కమిటీ ముందు ప్రజెంటేషన్




02




# లూజ్ ఫాస్టాగ్‌లకు చెల్లుచీటి

## నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా కీలక నిర్ణయం

- టోల్ ప్లాజాల వద్ద రద్దీ తగ్గించేందుకు చర్యలు
- లూజ్ ఫాస్టాగ్‌ల సమాచారాన్ని రిపోర్ట్ చేయాలని సూచన
- పర్స్ నుండి చూపించే పద్ధతికి ముగింపు




02

నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై లూజ్ ఫాస్టాగ్ లను నిషేధించనుంది. లూజ్ ఫాస్టాగ్ ల సమాచారాన్ని టోల్ గేట్ కలెక్టివ్ ఏజెంట్లు ఎన్ హెచ్ఏఐ కి రిపోర్ట్ చేయాలని సూచించింది.

# ఇందిరమ్మ క్యాంటీన్లలో బ్రేక్ ఫాస్ట్ మెనూ రెడీ

- రూ.5కే రోజుకో వెరైటీ బ్రేక్ ఫాస్ట్
- ఆరు రోజులు ఐదు వైరైటీలు
- ఈ మేరకు సిద్ధమవుతున్న రాష్ట్ర సర్కార్
- మొత్తం ఒక్క ప్లేట్‌కు ధరగా రూ.19 నిర్ణయం
- రూ.14 ఖర్చును భరించనున్న జీహెచ్ఎంసీ

02




## కూకట్‌పల్లి కల్తీ కల్లు విషాదం.. మృతుల సంఖ్య 9కి చేరిక

- నిమ్స్, గాంధీ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులు
- కిడ్నీ సమస్యలతో పెరుగుతున్న రోగుల సంఖ్య
- 34 మందిలో 9 మందికి డయాలసిస్






## ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలకు హైకోర్టులో నిరాశ

- ఫీజులు పెంపు పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు
- ఆరు వారాల్లో ప్రతిపాదనలు పంపాలని సూచనలు

.. వివరాలు 2లో




## హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌పై తీవ్ర ఆరోపణలు

### అవినీతి, నిధుల దుర్వినియోగం

- హెచ్‌సీఏ అవినీతి కూపం, రద్దు చేయాలని డిమాండ్
- హెచ్‌సీఏపై జనరల్ సెక్రటరీ గురువారెడ్డి తీవ్ర విమర్శలు
- అవినీతిలో రాజకీయ నాయకుల ప్రమేయంపై హెచ్చరిక
- సీబీఐ విచారణకు టీసీఏ డిమాండ్

## కొత్త రేషన్ కార్డుల జారీకి ముహూర్తం ఫిక్స్

- ఈ నెల 14న కొత్త కార్డుల పంపిణీకి రంగం సిద్ధం
- ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- లబ్ధిపొందనున్న 2.4 లక్షల కొత్త రేషన్ కార్డుదారులు

02





02

## బీజేపీ రామచంద్రా నోరు తెరవరేం..

- రాములోరి భూములను ఆక్రమింస్తుంటే మాటైనా మాట్లాడరేం
- రాములోరి భూముల కబ్జాలపై కేటీఆర్ ఆసక్తికర ట్వీట్




## చార్మినార్ అగ్నిప్రమాదం మృతుల కుటుంబాలకు పరిహారం

### సీఎంఆర్ఎఫ్ నుంచి రూ. 85 లక్షల కలెక్టర్‌కు విడుదల

### పీఎం సహాయ నిధి నుంచి కూడా నష్టపరిహారం ప్రకటన

హైదరాబాద్, జులై 11 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌లోని చార్మినార్ సమీపంలో గుల్జార్ హౌజ్‌లో గత మే నెలలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో 17 మంది మరణించారు. ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు

మిగతా 2 లో



## హైదరాబాద్‌లో నాలాల ఆక్రమణలపై హైడ్రా ఫోకస్

### ఆక్రమణలను తొలగింపుకు హైడ్రా చర్యలు ముమ్మరం

హైదరాబాద్, జులై 11 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌లో వర్షాకాలంలో వరదలు ముంచెత్తకుండా నాలాలపై ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు హైడ్రా చర్యలు ముమ్మరం చేసింది. కూకట్‌పల్లి, ఖైరతాబాద్ పరిసరాల్లో శుక్రవారం ఉదయం ప్రారంభమైన ఆపరేషన్‌లో హైడ్రా అధికారులు తొలుత బుల్కాపూర్ నాలా, ఐడీఎల్ నాలాల ఆక్రమణలను తొలగించే పనులను చేపట్టారు. బుల్కాపూర్ చెరువు నుంచి ప్రారంభమై, హైటెక్ సిటీ ప్రాంతాల గుండా హుస్సేన్ సాగర్‌లో కలిసే ఈ నాలా, గత కొన్నేళ్లుగా అనేక చోట్ల

మిగతా 4 లో

## మెడికల్ కళాశాల్లో పోస్టుల భర్తీకి స్వల్ప మార్పు

### దరఖాస్తుల స్వీకరణ తేదీల్లో చేర్పులు

### ఈ నెల 20 నుంచి ప్రారంభంకానున్న దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, జులై 11 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర వ్యాప్తంగా 34 ప్రభుత్వ మెడికల్ కళాశాల్లో 607 పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే, ఈ నెల 10 నుంచి 17 వరకు దరఖాస్తుల స్వీకరించాల్సి ఉండగా తాజాగా వైద్యుల విజ్ఞప్తి మేరకు దరఖాస్తుల స్వీకరణ తేదీల్లో

మిగతా 2 లో



## స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై కవిత వ్యాఖ్యలు

- ఆర్డినెన్స్ తో 42% రిజర్వేషన్లు తెలంగాణ జాగృతి విజయం
- గవర్నర్ ఆమోదించకుంటే మళ్ళీ ఉద్యమమే
- ఆర్డినెన్స్ కోసం 18 నెలలు ఎందుకు ఆగారు..?
- ప్రభుత్వ చిత్తశుద్ధిపై కవిత ప్రశ్న
- విద్యా, ఉద్యోగ రిజర్వేషన్ బిల్లుల సంగతేంటి..?
- బీజేపీ తలచుకుంటే నిమిషంలో చట్టబద్ధత : కవిత విమర్శ

02

# బెంగళూరులో తెలంగాణ క్రీడాకారుల అద్భుత ప్రదర్శన

## ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో పసిడి పతకాలు



తెలంగాణ బ్యూరో, జూలై 11 (తీన్మార్ న్యూస్): బెంగళూరులోని శ్రీ కంఠీరవ స్టేడియంలో జూలై 11, 12, 2025 తేదీలలో జరుగుతున్న 7వ ఇండియన్ ఓపెన్ పారా అథ్లెటిక్స్ ఇంటర్నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటారు. శుక్రవారం జరిగిన అథ్లెటిక్ క్రీడల్లో మన రాష్ట్రం నుండి జీవన్ జీ దీప్తి (%ు%20 విభాగం) 56.63 సెకన్లలో, అకీరా నందన్ (%ు%37 విభాగం) 51.71 సెకన్లలో పరుగు పందెంలో బంగారు పతకాలను సాధించి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. జావెలిన్, షాట్‌పుట్‌లో దేవేంద్ర ప్రతిభ అదేవిధంగా, దేవేంద్ర (జావెలిన్, షాట్‌పుట్ విభాగం) కూడా ఈ పోటీలలో పాల్గొని తన అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు.

**పారాలింపిక్ కమిటీ నుండి అభినందనలు**

తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచ స్థాయిలో చాటిచెప్పు, పారా క్రీడలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని పారాలింపిక్ కమిటీ కార్యనిర్వాహక సభ్యులు మరియు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షులు సింగారపు బాబు, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి, పారా అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి గాడిపల్లి ప్రశాంత్, సంయుక్త కార్యదర్శి ఉప్పునూతల రాజు మరియు కార్యనిర్వాహక సభ్యులు కళ్యాణ్ లు క్రీడాకారులను అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో రాణించాలని ఆకాంక్షించారు.

## హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌పై తీవ్ర ఆరోపణలు




హైదరాబాద్, జులై 11 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ లో జరిగిన అవినీతి ఆరోపణలపై తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ధరమ్ గురువారెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. హెచ్సీఏ సిటీకి మాత్రమే పరిమితమైందని, రాష్ట్రవ్యాప్తంగా క్రికెట్ అభివృద్ధికి దోహదం చేయడం లేదని విమర్శించారు. హెచ్సీఏ అధ్యక్షుడిగా ఎవరు ఉన్నా అవినీతి జరుగుతోందని, బీసీసీఐ నుంచి వచ్చే నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. కరోనా సమయంలో కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు తప్పుడు లెక్కలు చూపించారని, ఈ అవినీతి వెనుక రాజకీయ నాయకుల ప్రమేయం ఉందని, వారి వివరాలను బయటపెడతానని గురువారెడ్డి హెచ్చరించారు. ఈ అవినీతిపై సీబీఐ విచారణ జరపాలని టీసీఏ ఫిర్యాదు చేసింది. హెచ్సీఏను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేసింది. కాగా తెలంగాణ సీఐడీ హెచ్సీఏ అధ్యక్షుడు ఎ. జగన్‌మోహన్ రావు, ట్రెజరర్ సీజే శ్రీనివాస రావు, సీఈవో సునీల్ కాంతే, శ్రీ చక్ర క్రికెట్ క్లబ్ జనరల్ సెక్రటరీ రాజేందర్ యాదవ్, క్లబ్ అధ్యక్షురాలు జీ. కవితలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ వ్యవహారంలో రూ.2.32 కోట్ల నిధుల దుర్వినియోగం అయ్యాయని, గౌలీపుర క్రికెట్ క్లబ్ (పేరు శ్రీ చక్ర క్రికెట్ క్లబ్‌గా మార్చబడింది) సభ్యత్వం కోసం జగన్‌మోహన్ రావు నకిలీ పత్రాలు సృష్టించారని సీఐడీ తెలిపింది. అలాగే 2025 ఐపీఎల్ సీజన్‌లో రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టును అదనపు టికెట్‌ల కోసం బెదిరింపులు, కార్పొరేట్ బాక్స్‌ల యాక్సెస్ కోసం జగన్‌మోహన్ రావు బెదిరించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

## కొత్త రేషన్ కార్డుల జారీకి ముహూర్తం ఫిక్స్

హైదరాబాద్, జులై 11 (తీన్మార్ న్యూస్): రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డుల జారీకి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 14వ తేదీన తుంగతుర్తి నియోజకవర్గంలో కొత్త కార్డుల పంపిణీని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. 2.4 లక్షల కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సీఎం లాంఛనంగా ప్రారంభించనున్నారు. 11.30 లక్షల మంది నిరుపేదలకు ప్రయోజనం చేకూరుతుందని ప్రభుత్వం వెల్లడించింది.

గడిచిన ఆరు నెలల కాలంలో రాష్ట్రంలో 41 లక్షల మందికి ప్రభుత్వం కొత్తగా రేషన్ పంపిణీ చేసిన సర్కార్ కొత్తగా జారీ చేసిన రేషన్ కార్డులతో కలిపి రాష్ట్రంలో రేషన్ కార్డుల సంఖ్య 94,72,422కు చేరుతుంది. మొత్తంగా 3 కోట్ల 14 లక్షల మందికి లబ్ధి చేకూరనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం తెలిపింది.

## బీజేపీ రామచంద్రా నోరు తెరవరేం..

హైదరాబాద్, జులై 11 (తీన్మార్ న్యూస్): భద్రాద్రి రాములోరి భూముల కబ్జాలను అడ్డుకునేందుకు వెళ్లిన ఆలయ ఈవో రమాదేవిపై ఏపీలోని పురుషోత్తపట్నం గ్రామస్తులు ఇటీవల దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన నేపథ్యంలో శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆసక్తికర ట్వీట్ చేశారు. బీజేపీ రామచంద్రా నోరు తెరవరేం? రాములోరి భూములను ఆక్రమించుకుంటోంటే మాటైనా మాట్లాడరేం? మీ భాగస్వామి ప్రభుత్వం చెరలో ఉన్నాయని వదిలేస్తున్నారా? లేక ఈ సారి మొత్తం భద్రాద్రినే గంపగుత్తగా వారి చేతిలో పెడదామని అనుకుంటున్నారా? అని ప్రశ్నలు సంధించారు. ఓట్ల కోసమే చేసే మీ రామజపాలను, సీట్ల కోసమే వేసే మీ దొంగ నాటకాలను, తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఈ రాములోరి భూముల కబ్జా విషయంపై ప్రధాని మోడీతో మాట్లాడతారో మీ దోస్త్ దగ్గర మోకరిల్లుతారో మీ ఇష్టం అంటూ సూచించారు. భద్రాద్రిని కాపాండి, ఆక్రమణల చెరలో నుంచి విడిపించండి అని పిలుపునిచ్చారు.



## ఇందిరమ్మ క్యాంటీన్లలో బ్రేక్ ఫాస్ట్ మెనూ రెడీ




హైదరాబాద్, జులై 11 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్ లో ఇందిరమ్మ క్యాంటీన్లలో బ్రేక్ ఫాస్ట్ మెనూ రెడీ అయ్యింది. సామాన్య ప్రజలకు రూ.5కే రోజుకో వెరైటీ బ్రేక్ ఫాస్ట్ ను తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఆరు రోజులు ఐదు వెరైటీల బ్రేక్ ఫాస్ట్ మెనూ రెడీ చేసింది. మిల్లెట్ ఇడ్లీ, మిల్లెట్ ఉప్మా, పొంగల్, ఇడ్లీ, పూరీ పెట్టనుంది. మొత్తం ఒక్క ప్లేట్ కు ధర రూ.19 నిర్ణయించింది. ప్రజల నుంచి ఒక్కో ప్లేట్ కు రూ. 5 వసూలు చేయనుంది. మిగతా రూ.14 ఖర్చును జీహెచ్ఎంసీ భరించనుంది. హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ మెనూను అందించనుంది. హైదరాబాద్‌లోని 150 ఇందిరమ్మ క్యాంటీన్లలో ఈ అల్పాహార పథకాన్ని మొదటగా అమలు చేయనున్నారు. కొత్త కంటైనర్ క్యాంటీన్లను కూడా 139 ప్రాంతాల్లో రూ. 11.43 కోట్లతో ఏర్పాటు చేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. గతంలో ఉన్న అన్నపూర్ణ క్యాంటీన్లను ఇందిరమ్మ క్యాంటీన్లుగా పేరు మార్చిన సంగతి తెలిసిందే.

**ఆరు రోజులు ఇలా**

మొదటి రోజు: మూడు మిల్లెట్ ఇడ్లీలు (సాంబార్, చట్నీ,పొడి)
రెండో రోజు : మిల్లెట్ ఉప్మా(సాంబార్,మిక్స్ చట్నీ)
మూడో రోజు : పొంగల్(సాంబర్ ,చట్నీ)
నాల్గో రోజు : మూడు ఇడ్లీలు( సాంబార్,చట్నీ)
ఐదో రోజు : పొంగల్ (సాంబార్,చట్నీ)
ఆరో రోజు : మూడు పూరీలు(ఆలూ కుర్మా)

## స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై కవిత వ్యాఖ్యలు



హైదరాబాద్, జులై 11 (తీన్మార్ న్యూస్): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆర్డినెన్స్ ద్వారా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం బీసీ బిడ్డలు, తెలంగాణ జాగృతి, యునైటెడ్ ఫూలే ఫ్రంట్ విజయం అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఆర్డినెన్స్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటన చేసిన నేపథ్యంలో ఈ నెల 17వ తేదీన తాము నిర్వహించతలపెట్టిన రైల్ రోకోను నిరవధిక వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని తన నివాసంలో మీడియాతో మాట్లాడిన కవిత ప్రభుత్వం తీసుకువచ్చే ఆర్డినెన్స్ ను ఆమోదించకుండా గవర్నర్ ఆపితే మళ్లీ రైల్ రోకో తప్పదని హెచ్చరించారు. బీజేపేతర పాలిత రాష్ట్రాల్లో గవర్నమెంట్ కు గవర్నర్లకు మధ్య పంచాయితీలు నడుస్తున్నాయి. ప్రభుత్వాలు ఆర్డినెన్సులు, బిల్లులు పంపితే సంతకాలు పెట్టకుండా గవర్నర్లు ఆపుతున్నారు. తెలంగాణలో అదే పరిస్థితి వస్తే మాకు ఉద్యమాలు కొత్తకాదని మళ్లీ ఉద్యమం చేస్తామని రైళ్లు, బస్సులను స్తంభింపచేస్తామన్నారు. ఆర్డినెన్స్ రూపంలో వెంటనే రిజర్వేషన్లు కల్పించాలన్న కేబినెట్ నిర్ణయంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని కవిత అన్నారు. ఆర్డినెన్సు రూపంలోనే రిజర్వేషన్లు కల్పించాలనుకుంటే 18 నెలల పాటు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం ఎందుకు ఆగాల్సి వచ్చిందని ప్రశ్నించారు. తాము తీసుకువచ్చిన బిల్లు ద్వారానే బీసీలకు రిజర్వేషన్లు వచ్చాయనే రాజకీయ లబ్ది కోసమే ఇంతకాలం ప్రభుత్వం ఆగిందని విమర్శించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఈ వారం రోజుల్లో బీసీ రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ ఇవ్వాలని ఈ మేరకు ప్రభుత్వ కార్యాచరణను ఓ కంట కనిపెడుతూనే ఉంటామన్నారు.

**మరి రెండో బిల్లు సంగతేంటి..?**

తెలంగాణ జాగృతి పోరాటం వల్లే బీసీలకు విద్య, ఉద్యోగాలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు కల్పించేలా తెలంగాణ అసెంబ్లీ రెండు బిల్లులను తీసుకువచ్చిందని కవిత అన్నారు. అయితే గురువారం కేబినెట్ మాత్రం కేవలం రాజకీయాలకు సంబంధించిన బిల్లుపైనే మాట్లాడిందని మరి విద్యా, ఉద్యోగాలకు సంబంధించిన బిల్లు సంగతి ఏమిటని ఆమె ప్రశ్నించారు. బీసీలుకు విద్య, ఉద్యోగాలలో రిజర్వేషన్లపై ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయ బిల్లు కోసం ఆర్డినెన్స్ ఇచ్చి, విద్యా ఉద్యోగాలకు సంబంధించిన బిల్లు కేంద్రం నుంచి వచ్చాక అమలు చేస్తారా? అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ బిడ్డలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. విద్యా ఉద్యోగాలు, పెన్షన్లు, మహిళలకు రూ. 2500 వంటి హామీలు అమలు చేయకపోవడం వల్ల జనాభాలో ఎక్కువ భాగం ఉన్న బడుగు, బలహీన వర్గాల ప్రజలే ఎక్కువ నష్టపోతున్నారని అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, ఇచ్చిన హామీలను ప్రజలు మర్చిపోయేలా ప్రతిరోజు రాజకీయాల చుట్టే డైవర్ట్ చేస్తున్నారని విమర్శించారు.

**బీజేపీ తలచుకుంటే నిమిషం పని:**

బీజేపీ తలుచుకుంటే ఒకే ఒక్క నిమిషంలో రాజ్యాంగ సవరణ చేసి బీసీలకు చట్టబద్ధంగా రిజర్వేషన్లు కల్పించవచ్చని కవిత అన్నారు. కానీ వారికి స్పష్టమైన మెజార్టీ ఉన్నా ఆ పని చేయడం లేదని విమర్శించారు. ఈ విషయంలో తప్పంతా కాంగ్రెస్ పై తోసేసి బీజేపీ తప్పించుకోవాలని చూస్తే ప్రజలు అంతా గమనిస్తున్నారని చెప్పారు. తెలంగాణ నుంచి బీజేపీకి 8 మంది ఎంపీలు ఉంటే అందులో ఇద్దరు కేంద్ర మంత్రులుగా ఉన్నారని వీరిలో ఒకరు బీసీ బిడ్డ ఉన్నారన్నారు. బీసీ బిడ్డ అయిన కేంద్ర మంత్రి బండి సంజయ్ బీసీ బిల్లు ఆమోదం పొంది శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

## లూజ్ ఫాస్టాగ్‌లకు చెల్లుచీటి

న్యూ ఢిల్లీ, జులై 11 (తీన్మార్ న్యూస్): నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై లూజ్ ఫాస్టాగ్ లను నిషేధించనుంది. లూజ్ ఫాస్టాగ్ ల సమాచారాన్ని టోల్ గేట్ కలెక్టివ్ ఏజెంట్లు ఎన్ హెచ్ఏఐ కి రిపోర్ట్ చేయాలని సూచించింది. జనరల్ గా వాహనదారులు తమ ఫాస్టాగ్ ను వెహికిల్ విండ్ షీల్డ్ పై అతికిస్తారు. అపుడు టోల్ గేట్ వద్ద స్కానర్లు వాటిని ఈజీగా స్కాన్ చేసే అవకాశం ఉంటుంది. అయితే కొంతమంది వాహనదారులు మాత్రం ఫాస్టాగ్ లను టోల్ గేట్ వచ్చినపుడు పర్సుల్నించి తీసి చూపిస్తున్నారు. దీనినే లూజ్ ఫాస్టాగ్ అంటారు. దీనివల్ల టోల్ ప్లాజాల వద్ద రద్దీ పెరుగుతోంది. దీనిని కట్టడి చేసేందుకు జాతీయ రహదారుల సంస్థ అలాంటి లూజ్ ఫాస్టాగ్ లపై చర్యలకు దిగుతోంది. ఇకపై అలాంటి ఫాస్టాగ్ లను బ్లాక్ లిస్టులోకి చేర్చనుంది. ఇందుకోసం ప్రత్యేక ఈమెయిల్ ఐడీని టోల్ ప్లాజా నిర్వాహకులకు అందజేసింది.

## కూకట్‌పల్లి కల్తీ కల్లు విషాదం.. మృతుల సంఖ్య 9కి చేరిక

హైదరాబాద్, జులై 11 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో చికిత్స పొందుతున్న బాధితుల హెల్త్ అప్డేట్ అధికారులు విడుదల చేశారు. నగరంలోని గాంధీ, నిమ్స్‌లో చికిత్స పొందుతున్న భాదితుల శుక్రవారం హెల్త్ బులిటెన్‌లో కీలక విషయాలను వెల్లడించారు. నిమ్స్ వైద్యుల హెల్త్ బులిటెన్ ప్రకారం చికిత్స పొందుతున్న వారిలో కిడ్నీ బాధితుల సంఖ్య పెరుగుతోంది. మొత్తం 34 మంది నిమ్స్ లో అడ్మిట్ అయ్యారు. ఇందులో భాగంగా కిడ్నీల్లో సమస్య ఉన్న 9 మందికి డయాలసిస్‌పై ట్రీట్‌మెంట్ అందిస్తున్నట్లు వైద్యులు ప్రకటించారు. 11 మంది ఆరోగ్యం నిలకడగా ఉందని, మరో 12 మంది నిరంతరం పర్యవేక్షణ లో ఉన్నారని పేర్కొన్నారు.

అలాగే గాంధీ హాస్పిటల్లో హెల్త్ అప్డేట్ ప్రకారం ప్రస్తుతం 15 మంది పేషెంట్లు చికిత్స పొందుతున్నారు. ఇందులో 13 మంది ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఇద్దరికి కిడ్నీల్లో సమస్య ఉందని, వారికి డయాలసిస్ (సీఆర్ఆర్‌టీ) చేస్తున్నారని వెల్లడించారు. కాగా, కూకట్‌పల్లిలో కల్తీ కల్లు ఘటనలో మృతుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. గురువారం వరకి 8 మంది మృతి చెందగా గాంధీలో చికిత్స పొందుతున్న చాకలి పెద్ద గంగారాం (70) నిన్న అర్ధరాత్రి మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య 9 కి చేరింది. గాంధీ, నిమ్స్‌తో పాటు ఈఎస్ఐ, ప్రైవేటు ఆస్పత్రిలో మరికొందరు చికిత్స తీసుకుంటున్నారు. మొత్తంగా బాధితుల సంఖ్య 51 కి చేరింది.

## ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలకు హైకోర్టులో నిరాశ




హైదరాబాద్, జులై 11 (తీన్మార్ న్యూస్): ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీలకు తెలంగాణ హైకోర్టులో నిరాశ ఎదురైంది. ఫీజులు పెంచాలన్న ప్రైవేట్ కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. ఫీజుల పెంపు కోసం ఇచ్చిన వినతులపై ఫీజుల నియంత్రణ కమిటీకి (టీఏఎఫ్ఆర్సీ) ఆరు వారాల్లో నిర్ణయం తీసుకుని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించింది. ఫీజుల పెంపునకు ప్రభుత్వం నిరాకరించాన్ని సవాల్ చేస్తూ సుమారు 11 ఇంజినీరింగ్ కాలేజీలు గురువారం హైకోర్టులో లంచ్ మోషన్ రూపంలో పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ పిటిషన్లపై నిన్నటి జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ జరపగా శుక్రవారం ప్రైవేటు కాలేజీల పిటిషన్లు కొట్టివేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ప్రభుత్వం తీసుకునే తుది నిర్ణయంపైనే ఫీజుల పెంపు ఆధారపడి ఉంటుందని స్పష్టం చేసింది.

**ప్రతి యేడు ఇదే తంతా?:**

ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజుల పెంపునకు సంబంధించి ఏటా ఓ తంతు నడుస్తోందంటూ టీఏఎఫ్ఆర్సీ తీరుపై గురువారపు విచారణ సందర్భంగా హైకోర్టు అసంతృప్తి వ్యక్తం చేశారు. విచారణ చేపట్టి మూడేళ్లకోసారి కాలేజీలను పరిశీలించి పెంపుపై నిర్ణయం తీసుకోలేకపోవడం సరికాదంది. ఫీజుల పెంపు కోసం డిసెంబర్ లో ప్రతిపాదనలు వస్తే జూన్ వరకు ఎందుకు నిర్ణయం తీసుకోలేదు కమిటీలో 15 మంది సభ్యుల వరకు ఉన్నారు. అయినా ఇంత జాప్యమెందుకు అని ప్రశ్నించింది. అలాగే ఫీజులు పెంచాలని టీఏఎఫ్ఆర్ సీ పై ఎందుకు ఒత్తిడి తీసుకురాలేదని కాలేజీలను ప్రశ్నించింది. కౌన్సెలింగ్ పూర్తయ్యాక పిటిషన్లు వేయడం ఏంటని మండిపడింది. కాలేజీల తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ డిసెంబర్ లో ప్రతిపాదనలు పంపగా మార్చిలో కమిటీ సమావేశమై తమ ప్రతిపాదనలను ఆమోదించిందని కోర్టుకు తెలిపారు. ప్రభుత్వం తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ కాలేజీల్లో కొన్ని గత ఏడాది కంటే సుమారు 70 నుంచి 90 శాతం పెంపు అడుగుతున్నాయని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. వాదనలు విన్న న్యాయస్థానం ప్రైవేట్ కాలేజీలు దాఖలు చేసిన పిటిషన్లను కొట్టివేసింది. ఫీజుల విషయంలో ఆరు వారాల్లోగా నిర్ణయం తీసుకోవాలని టీఏఎఫ్ఆర్సీ ఆదేశించింది.

## చార్మినార్ అగ్నిప్రమాదం మృతుల కుటుంబాలకు పరిహారం




మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సహాయంగా రూ. 85 లక్షల నష్టపరిహారాన్ని మంజూరు చేసింది. ఈ మొత్తాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు విడుదల చేస్తూ రెవెన్యూ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ అగ్నిప్రమాదం శ్రీ కృష్ణ పెర్ల్స్ యజమాని ప్రహ్లాద్ మోడీ నివాసంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగింది. ఈ ఘటనలో 21 మందిలో కేవలం నలుగురు మాత్రమే బయటపడగలిగారు. అలాగే బాధిత కుటుంబాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పీఎం జాతీయ సహాయ నిధి నుంచి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50,000 చొప్పున ప్రకటించారు.

## మెడికల్ కళాశాల్లో పోస్టుల భర్తీకి స్వల్ప మార్పు

మొదటి పేజీ తరువాయి

మెడికల్ అండ్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు స్వల్ప మార్పులు చేసింది. ఈ నెల 20 నుంచి 27 వరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను తీసుకోనున్నట్లుగా ఇవాళ ఓ ప్రకటనను విడుదల చేసింది. అభ్యర్థులు బోర్డు అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ అప్లికేషన్‌తో పాటు అన్ని సర్టిఫికెట్లను అప్‌లోడ్ చేయాలని అధికారులు సూచించారు. అయితే, మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్, కుల ధృవీకరణ, ఇతర సర్టిఫికెట్లు సమకూర్చుకునేందుకు కొంత సమయం ఇవ్వాలని పెద్ద ఎత్తున విజ్ఞప్తులు రావడంతో దరఖాస్తు స్వీకరణ తేదీల్లో స్వల్ప మార్పులు చేస్తూ బోర్డు ఈ నిర్ణయం తీసుకున్నది.

# దివ్యాంగుల ఉపాది మరియు పునరావాస పథకం

ములుగు జిల్లా, జూలై 11 (తీన్మార్ న్యూస్): దివ్యాంగులు ఆర్థిక స్వాలంబన పొంది, ఇతరుల వలే సాదారణ జీవనం గడపడానికి వ్యవసాయ మరియు అనుబంద పరిశ్రమలు,సేవా,వ్యాపారములను స్థాపించుకొని జీవనోపాది పొందాలనే ఉద్దేశ్యంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులు మరియు వయో వృద్దుల సంక్షేమ శాఖ ద్వారా దివ్యాంగులు ఉపాధి మరియు పునరావాస పథకం ప్రవేశ పెట్టబడింది. ఈ పథకం క్రింద బ్యాంకు లింకేజి లేకుండా నేరుగా రూపాయలు రూ.50,000 సబ్సిడీ ఇస్తుంది. 2025-26 ఆర్థిక సంవత్సరమునకు ఈ పథకం కింద మన జిల్లాకు 09 యూనిట్ల ద్వారా 4. 50 (రూ.4 లక్షల 50 యాబై వేలు) మరియు బ్యాంకు లింకేజి 3 యూనిట్ల సబ్సిడీ మంజూరు చేయడం జరిగినది. 2025-26 సంవత్సరమునకు లబ్దిదారుల ఎంపిక ఆన్లైన్ ద్వారా జరుగుతున్నది. అర్హులైన దివ్యాంగులు ఈ పథకం కింద లబ్ది పొందడానికి ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవలసినదిగా జిల్లా సంక్షేమ అధికారి టి. రవి తెలియజేశారు. దరఖాస్తు చేసుకునే దివ్యాంగులు www.tsobmms.cgg.gov.in ఈ యొక్క వెబ్ సైట్ తేది: 14-07-2025 నుండి అందుబాటులోకి వస్తుంది. దరఖాస్తు చేసుకొనే చివరి తేది:31-07-2025. ఇట్టి విషయాన్ని దివ్యంగా సోదరులు గమనించగలరు.

**ఈ పథకం కింద అర్హులు:**

1. కనీస దివ్యంగత్వం 40% శాతం పైన ఉండాలి
2. 21 నుండి 55 సంవత్సరాల వయస్సులోబడి ఉండాలి
3. ఆదాయ పరిమితి 1.5 లక్షలకు - గ్రామీణ ప్రాంతాలలో, 2 లక్షలు - పట్టణ ప్రాంతాలలో

ములుగు జిల్లా లోని దివ్యాంగులు ఈ పథకం కింద లబ్ది పొందడానికి www.tsobmms.cgg.gov ద్వారా తేది:14-07-2025 నుండి 31-07-2025 వరకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

గమనిక:- గతంలో సబ్సిడీ మరియు లోను మంజూరు నిమిత్తం దరఖాస్తు చేసుకొని ఇట్టి పత్రికా ప్రకటన వెలువడిన తేది వరకు ఎలాంటి సబ్సిడీ మంజూరు కాలేని, పెండింగు దరఖాస్తుదారులు తిరిగి పైన తెలిపిన వెబ్ సైట్ నందు కొత్తగా మరల దరఖాస్తు చేయుకోనవలయును.

ఇతర వివరాలకై జిల్లా సంక్షేమ అధికారి, మహిళ, శిశు, దివ్యాంగుల మరియు వయో వృద్దుల సంక్షేమ శాఖ,ములుగు గారిని అన్ని కార్యాలయ పనివేళలలో సంప్రదించగలరని తెలియజేయడమైనది.

# మండల తహసీలార్ కార్యాలయంలో కలెక్టర్ తనిఖీ



కాటారం, జూలై 11 (తీన్మార్ న్యూస్): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం తహసీల్దార్ కార్యాలయంలోని ఫైళ్ళను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. మండలంలో జరుగుతున్న చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూ సేకరణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూ భారతిలో వచ్చిన దరఖాస్తుల వివరాలు అడిగి తెలుసుకుని ఎంత మందికి నోటీసులు జారీ చేశారని ప్రశ్నించారు. మొత్తం మండలంలో 5,610 భూభారతి దరఖాస్తులు వచ్చాయని అందులో 412 మంది దరఖాస్తు దారులకు నోటీసులు జారీ చేసినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపగా, భూ భారతిలో వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆగస్ట్ 15 వ తేదీ వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు డిటి రామ్మోహన్, ఆర్.ఐ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చదువుతో పాటు నాణ్యమైన భోజనం అందించాలి



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, జూలై 11 (తీన్మార్ న్యూస్): విద్యార్థులకు చదువుతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం కాటారం మండలం, దామెరకుంటలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, గంగారం మోడల్ పాఠశాలలను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మిక తనిఖీ చేశారు. దామెరకుంట గ్రామంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల తనిఖీ సందర్భంగా పాఠశాలలో పరిశుభ్రత కరువైందని గుర్తించి కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. డైనింగ్ హాల్ పరిశీలించి వంట కోసం తతెచ్చిన కూరగాయలు పరిశుభ్రంగా లేకపోవడం, వంటగదిలో ఈగలు ఉండడం, వంటగది పరిసరాలు ఆపరిశుభ్రంగా ఉండటంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకొని, ఆహార తయారీ ప్రదేశాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యానికి హాని కలగకూడదని, పాఠశాలలో పరిశుభ్రత, పారిశుద్య ప్రమాణాలు పాటించాలని స్పష్టం చేశారు. తాను. మళ్ళీ తనిఖీకి వస్తానని మార్పు రాకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిశుభ్రత పాటిస్తూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వంట గది, డైనింగ్ హాల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాని హెచ్చరించారు. వానాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థుల ఆరోగ్య సంరక్షణ చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు అనారోగ్య బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వైద్య పరీక్షలు నిర్వహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, స్టోర్ రూమ్, డార్మెటరీలను పరిశీలించి విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాలపై నివేదిక ఇవ్వాలని స్పష్టం చేశారు. పాఠశాలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. కొన్ని చోట్ల భవనం పెచ్చులు ఊడుతున్నాయని విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో తరగతి గదులు సరిపోవడం లేదని ఉపాధ్యాయులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా పాఠశాల వెనకాల నిరుపయోగంగా ఉన్న జూనియర్ కళాశాల భవనాన్నీ పరిశీలించి మరమ్మతులు చేసి అందుబాటులోకి తేవాలని టి.ఎస్ ఈడబ్ల్యూఐడిసి ఈ.ఈ కి తక్షణమే ఫోన్ చేసి ఆదేశించారు. అనంతరం గంగారంలోని తెలంగాణ మాడల్ పాఠశాలను సందర్శించి పాఠశాలలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. పాఠశాల వెనుకాల గల హాస్టల్ భవనాన్ని పరిశీలించి త్వరిత గతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాల భవనం ముందు కొంత మేర మిగిలిన సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని, పాఠశాల విద్యార్థుల కోసం వంట గది నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ప్రధానోపాధ్యాయులు కోరగా నిధులు మంజూరు చేస్తామని హాస్టల్ భవనంలో గీజర్లతో పాటు కావలసిన మౌలిక వసతుల కల్పనకు నివేదికలు అందించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజేందర్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో బాబు తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

## 2008లో వేసిన శిలాఫలకానికి క్షీరాభిషేకం



మహబూబునగర్, జులై 11 (తీన్మార్ న్యూస్): 2008 సంవత్సరం లో కొల్లాపూర్ మార్కెట్ యార్డ్ ఎదురుగా ఉన్న ప్రభుత్వ స్థలంలో కొల్లాపూర్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తూ వేసిన శిలాఫలకం శిథిల వ్యవస్థకు చేరింది నాగర్ కర్నూల్ జిల్లా టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ముక్కలైన శిలా ఫలకానికి కొల్లాపూర్ జర్నలిస్టులు క్షీరాభిషేకం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. కొల్లాపూర్ లో దీక్షలు నిర్వహిస్తున్న జర్నలిస్టులు బచ్చల కూర కురుమయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి టిడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటికొండ కృష్ణ జిల్లా అధ్యక్షులు రామచందర్ నియోజకవర్గ కన్వీనర్ జలకం మద్దిలేటి లు మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజక వర్గం లోని జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలను ఇవ్వాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 17వ రోజుకు చేరుకున్న జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఆలోచన పాలకులలో కలగడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో పక్క నియోజకవర్గాలలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ప్రభుత్వం కొల్లాపూర్ నియోజక వర్గంలో ఒక్కరికి కూడా ఇంటి స్థలం ఇవ్వలేదు అన్నారు

2008 సంవత్సరంలో కొల్లాపూర్ పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఎదురుగా సర్వే నెంబరు 88 లో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను కేటాయిస్తూ శిలాఫలకం కూడా వేశారని వారు గుర్తు చేశారు శిలాఫలకం వేసిన అప్పటి పాలకులు ఇప్పుడు కూడా కొల్లాపూర్ కు పాలకులుగా ఉన్నారు కానీ శిలాఫలకం శిథిలమై ముక్కలైవుందని జర్నలిస్టులకు మాత్రం ఇళ్ల స్థలాలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టులను ఆనాటి నుంచి ఈనాటి వరకు పాలకులు మోసం చేస్తూనే ఉన్నారని వారు ఈ సందర్భంగా విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పాలకులు స్పందించి కొల్లాపూర్ నియోజక వర్గంలోని జర్నలిస్టుల కు ఇంటి స్థలాలు ఇవ్వాలని వారు పేర్కొన్నారు.కార్యక్రమంలో టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా నాయకులు మల్లికార్జున సాగర్ సీనియర్ జర్నలిస్టులు సిపి నాయుడు, రమణ, కారంగి గోవిందు, మల్లేష్, స్వాములు, గోపాసి కేశవులు, అరుణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం



మహబూబాబాద్ జిల్లా, జులై 11 (తీన్మార్ న్యూస్): ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని 2025 జూలై 11వ తేదీన ప్రజా అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డాక్టర్ రవి రాథోడ్, జిల్లా జనరల్ ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ జగదీశ్వర్ లు సంయుక్తంగా ప్రారంభిఒచిన ర్యాలీ, జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి నుంచి నెహ్రూ సెంటర్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ, జనాభా నియంత్రణ అవసరాన్ని గురించి ప్రజల్లో చైతన్యం పెంచడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చునని తెలిపారు. ప్రతి సంవత్సరం జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవంగా జరుపుకుంటున్నామని జనాభా పెరుగుదల ప్రపంచ సవాళ్లకు మూలమని పెరిగిపోతున్న జనాభా సమస్య(జనాభా విస్పోటనం ) దాని వల్ల కలిగే నష్టాల గురించి(నిరుద్యోగం, పౌష్టిక ఆహార లోపం, ఆకలి చావులు ) విద్యార్థులకు, యువతకు, ప్రజలకు, సమావేశాల ద్వారా, సమాజాన్ని చైతన్యము చేయడం ద్వారా, ప్రజలను భాగస్వామ్యం చేయడం ద్వారా, జనాభాను స్థిరీకరించడం జరుగుతుందని, అందుకే ఐక్యరాజ్యసమితి ప్రతి సంవత్సరం జూలై 11న ఒక నినాధం ద్వారా ప్రపంచ ప్రజలకు సందేశం ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. కుటుంబ నిర్వహణ, సురక్షిత మాతృత్వం, ఆరోగ్యపూరిత జీవనశైలిపై వివిధ సందేశాలతో ర్యాలీ కొనసాగింది. జనాభా నియంత్రణపై అవగాహన కల్పించేందుకు పంచాయతీ స్థాయిలో కూడా సమగ్ర కార్యక్రమాలు ఈ నెల 18 వ తేదీ వరకు చేపట్టనున్నట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. జిల్లా జనరల్ ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ జగదీశ్వర్ మాట్లాడుతూ జనాభాను అరికట్టడం ద్వారా వనరులను సక్రమమైన పద్ధతులలో వినియోగిస్తూ, యువతారానికి ఉద్యోగ, ఉపాధి కల్పిస్తూ, దేశాన్ని అభివృద్ధి పదములో నడుపుటకు ఎంతగానో దోహదం చేస్తుందని పేర్కొంటూ, అర్హులైన దంపతులు బిడ్డకు, బిడ్డకు మధ్య ఎడం కోసం తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటించి, మరొక ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనివ్వవచ్చని ఆయన తెలిపారు. అనంతరం స్థానిక ఐఎంఏ హాల్ లో జరిగిన సమావేశానికి జిల్లావైద్య ఆరోగ్య శాఖాధికారి అద్యక్షతన జరిగిన సమావేశములో కుటుంబ నియంత్రణ కార్యక్రమంలో ఉత్తమ సేవలు అంధించిన వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందికి అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సారంగం, డాక్టర్ సుధీర్ రెడ్డి, డాక్టర్ లక్ష్మినారాయణ, వైద్యాధికారులు, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, ఆశా నోడల్ ఆఫీసర్ సక్కుబాయి, ఆరోగ్య విద్యాభోధకులు కె.వి. రాజు, శారధ, సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ, లోక్య, మనోహర, అరుణ్, అనిల్ ఆరోగ్య కార్యకర్తలు. ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

# మెగా ఆధార్ క్యాంపులో 3,700కి పైగా సమస్యలకు పరిష్కారం

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలై 11 (తీన్మార్ న్యూస్): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన మూడు రోజుల మెగా ఆధార్ క్యాంపులు ప్రజల నుండి విశేష స్పందన పొందాయి అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒకప్రకటనలో తెలిపారు. మూడు రోజులపాటు జరిగిన ఈ మెగా క్యాంపు ద్వారా వేలాది మంది పౌరులు తమ ఆధార్ సంబంధిత సమస్యలను పరిష్కరించుకున్నారని అన్నారు. మూడు రోజులు పాటు నిర్వహించిన ఈ మెగా ఆధార్ క్యాంపు ద్వారా మొత్తం కొత్త నమోదులు - 489, వయోవృద్ధుల సేవలు - 45, వికలాంగుల నమోదు - 12, ట్రాన్స్జెండర్ నమోదు - 1, బయోమెట్రిక్, ఇతర అప్డేట్లు - 602, జనన తేదీ సవరణలు (DOB Limit Cases) - 5, ఆధార్ రద్దు కేసులు - 2 సాధారణ ఎంక్వయిరీలు - సుమారు 50 మరియు మొత్తం - 3,772 సమస్యలను పరిష్కరించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. మూడు రోజులపాటు నిర్వహించిన ఈ మెగా ఆధార్ క్యాంపకు పదివేలకు పైగా ప్రజలు వచ్చారని ఆయన తెలిపారు. వారిలో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వారికి, ధ్రువీకరణ పత్రాలు తీసుకొని మీసేవ కేంద్రాల ద్వారా ఆధార్ నవీకరణ చేసుకోవాలని సూచించారు. చాలా రోజులుగా పరిష్కారానికి నోచుకోని ఎన్నో ఆధార్ సమస్యలను ఈ ఆధార్ కేంద్రం ద్వారా పరిష్కరించబడ్డాయని అన్నారు. ఈ కార్యాక్రమం ద్వారా ప్రజలకు నేరుగా సేవలు అందించడం ద్వారా వారి సమస్యలు తక్షణమే పరిష్కరమయ్యాయి అన్నారు. మండలాల వారీగా నిర్వహించే మెగా ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకొని ఆధార సంబంధిత సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ ప్రజలను కోరారు. ఈ మెగా ఆధార్ క్యాంపును విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన రాష్ట్ర యుఐడిఐ బృందం మరియు ఈ డిస్టిక్ మేనేజర్ సైదేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది మరియు ఐటీ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు.

# బాల పురస్కార్ జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి**

హనుమకొండ జిల్లా, జూలై 11 (తీన్మార్ న్యూస్): మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం తరపున వివిధ రంగాలలో విశేష ప్రతిభ కనబరచిన బాల బాలికలకు ప్రతి ఏటా ప్రధానం చేస్తున్న ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ జాతీయ అవార్డులకు ఔత్సాహిక బాల బాలికల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 సంవత్సరానికి గాను అందించనున్న రాష్ట్రీయ బాల పురస్కార్ జాతీయ అవార్డులకు దరఖాస్తులను ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చని, 18 ఏళ్లలోపు బాల బాలికలు ఆవిష్కరణ మరియు సృజనాత్మకత, సామాజిక సేవ, పర్యావరణం పరిరక్షణ, క్రీడలు, కళలు, సంస్కృతి, సైన్స్ మరియు టెక్నాలజీ, ఇతర రంగాల్లో ప్రతిభ కనబరచిన బాలల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, అర్హులైన వారు తమ దరఖాస్తులను జూలై 30,లోపు ఆన్ లైన్లో http://awards.gov.in వెబ్ సైట్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్లైన్ లో దరఖాస్తు చేసిన వివరాల హార్డ్ కాపీలను జిల్లా కలెక్టర్ కార్యాయలయం (సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ సముదాయం (జి1, జి 2) లో సంప్రదించాలని జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి పేర్కొన్నారు.

# ప్రభుత్వ టీబీ, ప్రసూతి ఆసుపత్రులను సందర్శించిన జిల్లా కలెక్టర్





హనుమకొండ జిల్లా, జూలై 11 (తీన్మార్ న్యూస్): టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా టీబీ వ్యాధికి ఎక్కువగా గురయ్యే అవకాశం ఉన్న ప్రజలకు నిర్వహిస్తున్నటువంటి పరీక్షలలో భాగంగా ప్రస్తుతం నిర్వహిస్తున్న ఎక్స్ రే పరీక్షల తీరును అలాగే ఇంకా ఎక్కువ మందికి ఎక్స్ రే పరీక్షలు నిర్వహించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించేందుకు హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ శుక్రవారం సాయంత్రం ప్రభుత్వ టీబీ హాస్పిటల్ ను సందర్శించారు. ఆసుపత్రిలో ప్రతిరోజు ఎన్ని ఎక్స్ రే లు తీస్తున్నారు, ఇంకా ఎక్కువ చేయడానికి అవకాశం ఉందా, ఇప్పటివరకు ఎన్ని ఎక్స్ రే లు తీశారని అని జిల్లా కలెక్టర్ ప్రశ్నించగా ప్రస్తుతం 30 నుంచి 40 వరకూ తీస్తున్నామని, ఇప్పటి వరకు 220 తీశామని 90 నుండి 100 వరకు తీసే అవకాశం ఉందని కానీ ఒక్కరే రేడియోగ్రాఫర్ అందుబాటులో ఉన్నారని టీబీ ఆస్పత్రి సూపరింటెండెంట్ తెలుపగా, పీహెచ్సీలలో ఎక్కడైనా రేడియోగ్రాఫర్ ఉన్నట్లయితే టీబీ ఆసుపత్రికి డిప్యూటీ చేయాలని డిఎంహెచ్ఓని ఆదేశించారు. ఆసుపత్రిలోని ఓపి విభాగాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో ఉన్న దయాగ్నొస్టిక్ విభాగాన్ని సందర్శించి అక్కడ ఉన్న ఎక్స్ రే మిషను ,అలాగే రోజువారి సామర్థ్యాన్ని, అందుబాటులో ఉన్న టెక్నీషియన్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం టీబీ చికిత్స పొందుతున్నటువంటి వ్యాధిగ్రస్తులందరికీ ముందుగా ఒక నెల పోషకాహార కిట్ అందించాలని, మిగతా చికిత్స కాలంలో కూడా వారికి పోషకాహార కిట్ అందించే దిశగా ప్రయత్నం చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. ఏ అప్పయ్య ,టీబీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, టీహబ్ మేనేజర్ కౌముది, తదితరులు పాల్గొన్నారు

# ఒక దేశం ఒకే ఎన్నికపై పార్లమెంటరీ కమిటీ సమావేశం

**ఏకకాల ఎన్నికల అంశంపై కమిటీ ముందు ప్రజెంటేషన్**



న్యూ ఢిల్లీ, జులై 11 (తీన్మార్ న్యూస్): ఒక దేశం ఒకే ఎన్నిక'పై సంయుక్త పార్లమెంటరీ కమిటీ శుక్రవారం న్యూఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో సమావేశమైంది. 39 మంది సభ్యుల కమిటీలో లోక్‌సభ నుండి 27 మంది సభ్యులు మరియు రాజ్యసభ నుండి 12 మంది సభ్యులు ఉన్నారు. లోక్‌సభ మరియు రాష్ట్ర అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడానికి వీలు కల్పించే లక్ష్యంతో ఉన్న రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు, 2024 మరియు కేంద్రపాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు, 2024లను పరిశీలించే విస్తృత కసరత్తులో భాగంగా ఈ సమావేశం జరిగింది. బిజెపి ఎంపి పిపి చౌదరి నేతృత్వంలోని ప్యానెల్ దాని కొనసాగుతున్న చర్చలలో భాగంగా న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరిపింది. ఈ సమావేశంలో, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జగదీష్ సింగ్ ఖేహర్ మరియు జస్టిస్ డి.వై. చంద్రచూడ్ దేశంలో ఏకకాల ఎన్నికల అంశంపై కమిటీ ముందు ప్రజెంటేషన్ ఇచ్చారు. బిజెపి ఎంపి అనురాగ్ ఠాకూర్, కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా, సమాజ్ వాదీ పార్టీ ఎంపి ధర్మేంద్ర యాదవ్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఏకకాల ఎన్నికల భావన దేశంలో కొత్త ఆలోచన కాదు. రాజ్యాంగం ఆమోదించబడిన తరువాత, 1951 నుండి 1967 వరకు లోక్‌సభ మరియు అన్ని రాష్ట్ర శాసనసభలకు ఎన్నికలు ఒకేసారి జరిగాయి. అయితే, కొన్ని రాష్ట్ర శాసనసభలు అకాల రద్దు కారణంగా 1968 మరియు 1969లో ఈ సమకాలిక ఎన్నికల చక్రం అంతరాయం కలిగింది.

# పేదవారి కళను నెరవేర్చడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం

### రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ లిసీతక్క)



ములుగు జిల్లా, జూలై 11 (తీన్మార్ న్యూస్): పేదవాడి కలలను నిజం చేయడానికి ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క. అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఇందిరమ్మ ఇండ్ల భూమి పూజా, నిర్మాణం పనులను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థ సంపత్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రతి నిరుపేద ఆడబిడ్డకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నిరుపేద కుటుంబానికి 5 లక్షల రూపాయలతో ఇండ్లను నిర్మించుకోవడానికి అవకాశం కల్పించిందని తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమాలను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. పేదవారి సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ముందుకు అడుగులు వేస్తుందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను అర్హులైన నిరుపేదల అందరికీ అందే

విధంగా చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంపత్, ఎంపిడిఓ రామకృష్ణ, ప్రజాప్రతినిధులు, ఇందిరమ్మ ఇండ్ల కమిటి సభ్యులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

# జనాభా నియంత్రణకు సమిష్టిగా కృషి చేయాలి

### కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఎక్కువగా చేపట్టాలి



జనగామ జిల్లా, జూలై 11 (తీన్మార్ న్యూస్): శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జూలై 11 వ తేదీ ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని పట్టణంలోని బస్టాండ్ చౌరస్తా వద్ద జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ర్యాలీని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మల్లికార్జున్ రావు తో కలిసి అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పింకేష్ కుమార్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. బస్టాండ్ చౌరస్తా నుండి కలెక్టరేట్ వరకు వైద్య సిబ్బందితో జనాభా నియంత్రణపై భారీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ 1987 లో ఐక్యరాజ్య సమితి జనాభా నియంత్రణకు చర్యలు తీసుకోగా 1989 జూలై 11వ తేదీ నుండి ప్రపంచ జనాభా దినోత్సవం గా పాటించడం జరుగుతున్నదని పేర్కొన్నారు. జనాభా నియంత్రణ కొరకు 61% లక్ష్యంకు గత సంవత్సరం 54 శాతం సాధించడం జరిగిందన్నారు. ఆశా కార్యకర్తలు ఇంటింటి సర్వే చేపట్టి కొత్తగా వివాహం జరిగిన మహిళలను గుర్తించి 23 సంవత్సరం లు ఉండి, ఆరోగ్యవంతురాలిగా ఉన్నప్పుడే గర్భం దాల్చేలా చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులకు తెలియ చెప్పాలన్నారు. శిశువుకు శిశువుకు మధ్య 3 సంవత్సరముల వ్యవధి ఉండే విధంగా కుటుంబ నియంత్రణకు తీసుకునే చర్యలు వివరించి చెప్పాలన్నారు. గర్భిణీ దాల్చిన నాటినుండి ప్రసవం అయ్యేవరకు పది రోజులకు ఒక్కసారి తప్పనిసరిగా మహిళను సందర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి అందుకు తగినట్లుగా వైద్యం అందిస్తూ రిజిస్టర్ లో నమోదు చేయాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మల్లికార్జునరావు మాట్లాడుతూ మహిళలు సంపూర్ణ ఆరోగ్య వంతురాలిగా ఉన్నప్పుడు గర్భం దాల్చినట్లయితే గర్భస్రావాల రేటు తగ్గుతుందని, వైద్య సిబ్బంది ఆ దిశగా కృషి చేయాలన్నారు. ఇప్పటి వరకు 32 శాతంగా ఉన్నామని తెలియజేశారు. అనంతరం ఒక పాపతో కుటుంబ నియంత్రణకు కృషిచేసిన కొండ పద్మను ఆదర్శ కుటుంబంగా గుర్తిస్తూ

శాలువా కప్పి, మెమెంటో తో పాటు ప్రశంస పత్రాన్ని అందించారు. అదేవిధంగా అత్యధికంగా 700 కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసిన డాక్టర్ శకుంతల, మోటివేషన్ పర్సన్ దీపారాణి, ఉత్తమ సేవలందించిన దేవరుప్పల మండల పి.హెచ్.సి. కి చెందిన ఆశా కార్యకర్త స్వప్న లను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో డాక్టర్ లు, ఏ.ఎన్.ఎమ్. లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్లు సహకరించాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ జిల్లా, జూలై 11 (తీన్మార్ న్యూస్): రబీ, ఖరీఫ్ 2024.25 CMR డెలివరీ, రేషన్ కార్డులు, రెవెన్యూ సదస్సు లలో వచ్చిన దరఖాస్తులు తదితర అంశాల పైన అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తహసీల్దార్ లతో, రైస్ మిల్లర్ల తో రివ్యూ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్యాలను అనుగుణంగా రైస్ మిల్లర్లు సీఎంఆర్‌ను నిర్ణీత సమయంలో డెలివరీ చేయాలన్నారు. లేనిచో చర్యలు తప్పవన్నారు. ఖరిఫ్ (వానాకాలం) 2024-25 సీజన్ కు సంబంధించి 91827.554 మెట్రిక్ టన్నుల బియ్యానికి గాను 73664.210 మెట్రిక్ టన్నుల బియ్యం, (80.22%) ఇప్పటికే మిల్లింగ్ చేసి డెలివరీ చేయగా ఇంకా 18163.344 మెట్రిక్ టన్నులు డెలివరీ చేయాల్సి ఉందనీ అలాగే రబీ (యాసంగి) 2024-25 సీజన్ కు సంబంధించి 144834.216 మెట్రిక్ టన్నుల బియ్యానికి గాను 38135.916 మెట్రిక్ టన్నుల బియ్యం, (26.33%) ఇప్పటికే మిల్లింగ్ చేసి డెలివరీ చేయగా ఇంకా 106698.300 మెట్రిక్ టన్నులు డెలివరీ చేయాల్సి ఉందన్నారు. దేవరోప్పుల మండలం మన్పహాడ్ గ్రామానికి చెందిన శ్రీ సాయి రామ్ మోడ్రన్ బిన్నీ రైస్ మిల్ రభి 2022 -23 అలాగే 2023 -24 పంటకు సంబంధించిన 5.67 కోట్ల విలువగల సిఎంఆర్ ను క్లియర్ చేయనందున యజమాని పి చంద్రశేఖర్ రెడ్డి పైన క్రిమినల్ కేసు వేయడం జరిగిందని అలాగే రెవెన్యూ రికవరీ ఆక్ట్ ప్రకారం ఆస్తుల జప్తుకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండ రైస్ మిల్లర్ యజమానులు సివిల్ సప్లై అధికారులు సమన్వయము గా పని చేయాలిసిన అవసరం ఉందన్నారు. అనంతరం తహసీల్దార్ లతో సమీక్షిస్తూ

కొత్త రేషన్ కార్డు ల జారీ అలాగే పాత రేషన్ కార్డు లలో మార్పులు, చేర్పులు కి సంబందించి ప్రక్రియ వేగవంతం కావాలన్నారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, నోటిస్ లు ఇచ్చిన దరఖాస్తు లకి సంబందించి వారం లో రెండు రోజులు హియారింగ్స్ పెట్టి భూ సమస్య లను పరిష్కరించాలన్నారు. NFBS దరఖాస్తు లకు సంబందించి అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలనను వేగవంతం చేయడం వలన NFBS జాతీయ కుటుంబ ప్రయోజన పథకం (National Family Benefit Scheme) కింద 769 మంది అర్హులైన లబ్ధిదారుల వివరాలను ప్రభుత్వానికి పంపగా.. అందులో 576 మందికి 20,000 చొప్పున 1,15,20,000 రూపాయలు మంజూరు అయ్యాయని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆర్డీవో లు, సివిల్ సప్లై అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# అధిక జనాభాతో అభివృద్ధికి ఆటంకం

### జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా

వరంగల్ జిల్లా, జులై 11 (తీన్మార్ న్యూస్): అధిక జనాభాతో అభివృద్ధికి ఆటంకం కలుగుతుందనిజిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా వరంగల్ కలెక్టరేట్ లో శుక్రవారం కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన ప్రపంచ జనాభా దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా మాట్లాడుతూ

పెరుగుతున్న జనాభా అనర్థాలకు కారణం అవుతుందన్నారు. ఈమేరకు జనాభా నియంత్రణ అవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు.జనాభా నియంత్రణ అదుపులో ఉండాలని, లేనిచో భావితరాలకు మౌలిక వసతులు, ఆరోగ్య రంగంపై ఒత్తిడి, విద్యా వనరులపై ప్రభావము, ఉద్యోగ అవకాశాల కొరత, లింగ అసమానతలు, సామాజిక వ్యత్యాసాలు వస్తాయని ,వనరులు సరిపోక సమస్యలు ఉద్భవిస్తాయని అన్నారు. జనాభాను నియంత్రణలో ఉంచడానికి బాలికల విద్యను ప్రోత్సహించాలని, బాల్య వివాహాలను నిర్మూలించాలని ,గర్భ నిరోధక పద్ధతులపై అవగాహన కల్పించాలని, ఆర్థిక స్వావలంబనను ప్రోత్సహించాలని, సామాజిక అభిప్రాయాలను మార్చడానికి విస్తృత ప్రచారం చేయాలని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖతోపాటు వివిధ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలలో జనాభా పెరుగుదల వలన వచ్చు సమస్యల పైన అవగాహన కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా జనాభా నియంత్రణలో కృషిచేసిన వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందిని సన్మానించడం, కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించిన దంపతులకు వెయ్యి రూపాయల ప్రోత్సాహక బహుమతి కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం జనాభా పెరుగుదలను అరికట్టడానికి ప్రజల్లో అవగాహన కల్పనకు రూపొందించిన కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముందుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం ఈ సంవత్సరం థీమ్ శరీరము మరియు మనసు



సిద్ధంగా ఉన్నప్పుడే తల్లి కావడానికి సరి అయిన సమయం పురస్కరించుకొని ఎంజీఎం వరంగల్ నర్సింగ్ స్కూల్ వద్ద నుండి ఎంజీఎం సర్కిల్ వరకు నర్సింగ్ విద్యార్థులు ,వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ద్వారా ర్యాలీ నిర్వహించడం జరిగింది. డాక్టర్ బి సాంబశివరావు వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాట్లాడుతూ ప్రపంచ జనాభా దినోత్సవం జరుపు కోవడం 1989 జులై 11న మొదలైనదని తెలిపినారు. ప్రపంచంలో ఇండియాలోనే జనాభా మొదటి స్థానంలో చేరుకున్నది, దానిని నియంత్రించడానికి వైద్య ఆరోగ్యశాఖ ప్రజలలో తాత్కాలికమైన , శాశ్వతమైన కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదనవు కలెక్టర్ సంధ్యారాణి, డిఆర్వో విజయలక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్వోలు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ కొమురయ్య ,

ఆర్ఎంఓ డాక్టర్ శశి కుమార్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అర్చన, డాక్టర్ ఆచార్య , డాక్టర్ విజయకుమార్, డాక్టర్ మోహన్ సింగ్, వైద్యాధికారులు ఆరోగ్యశాఖ సిబ్బంది, నర్సింగ్ కాలేజ్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛమైన అడ్డాకుల ప్లేట్స్ తో ఆరోగ్యం

### మేడారం వచ్చే భక్తులకు స్వచ్ఛమైన అడ్డాకుల ప్లేట్స్

### అడ్డాకుల ప్లేట్స్ యూనిట్ ను ప్రారంభించిన మంత్రి సీతక్క



గోవిందరావుపేట, జూలై 11 (తీన్మార్ న్యూస్): స్వచ్ఛమైన అడ్డాకుల ప్లేట్స్ లలో భోజనం చేయడం ద్వారా ఆరోగ్యం బాగుంటుందని, ప్లాస్టిక్ ప్లేట్ లలో భోజనం చేయడం ద్వారా భోజన ఉష్ణోగ్రతకు ప్లేట్ లోని మన కంటికి కనిపించని ప్లాస్టిక్ పదార్థాలు కరిగి భోజనంతో కడుపులోకి వెళ్లి అనారోగ్యపాలయ్యే అవకాశం ఉంటుందని స్వచ్ఛమైన అడ్డాకుల ప్లేట్స్ మేడారం భక్తులకు అందుబాటులో ఉంటాయని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం గోవిందరావు పేట మండలంలోని మొట్లగూడెం లో రాండ్స్టాడ్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్, సయోధ్య హోమ్ ఫర్ ఉమెన్ ఇన్ నీడ్ వారి సహకారంతో, సమ్మక్క సారలమ్మ అడవి ఆదివాసి సహకార సమాఖ్య అడ్డాకుల ప్లేట్ తయారీ యూనిట్ ను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థ సంపత్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ లతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ గోవిందరావుపేట మండలంలోని మోట్లగూడెం అనే చిన్న గ్రామంలోని 50 కుటుంబాలకు చెందిన ఆదివాసీ మహిళలు తయారు చేస్తున్న అడ్డాకుల ప్లేట్స్ బాగున్నాయని వీటి ద్వారా ఆరోగ్యానికి ఎలాంటి హాని జరిగే అవకాశం ఉండదని ఈ రోజుల్లో ప్రతి చిన్న చిన్న శుభకార్యాలకు కూడా ప్లాస్టిక్ ప్లేట్స్ ను ఉపయోగించడం వాటిలో భోజనం చేయడం భోజన ఉష్ణోగ్రతకు ప్లేట్లోని కంటికి కనిపించని ప్లాస్టిక్ పదార్థాలు కడుపులోకి వెళ్లడం ద్వారా అనారోగ్యపాలయ్యే అవకాశం ఉందన్నారు. మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఆదివాసి మహిళలు తయారు చేస్తున్న అడ్డాకుల ప్లేట్స్ అందుబాటులో ఉంటాయని వచ్చే భక్తులు ఇలాంటి స్వచ్ఛమైన ఆరోగ్యకరమైన ప్లేట్ లలో భోజనం చేయడం కోసం కొనుగోలు చేస్తే భక్తులకు ఆరోగ్యంతో పాటు ఆదివాసి మహిళలకు ఉపాధి కూడా కలుగుతుందని, వచ్చే భక్తులు ఇలాంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ఆదివాసీ మహిళలకు ఉపాధి కలిగించాలని సూచించారు. అంతకుముందు వన మహోత్సవంలో భాగంగా మంత్రి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ డి ఓ రమేష్, ఎఫ్ ఆర్ ఓ అబ్దుల్ రహమాన్, రాండ్స్టాడ్ గ్లోబల్ సంస్థ ప్రతినిధులు అక్యూల్, స్వాప్న విట్టల్, సంయుక్త మిక్కిలినేని, షైల్ దాసికా, సి ఎస్ ఆర్ టిమ్ ప్రణథి పూర్ణ, సైలాజా, వంశీ కృష్ణ, వినయ్ వంగళ, స్మిత కదారి, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

# వన మహోత్సవ లక్ష్యాలను సాధించాలి

### అదనపు కలెక్టర్ విద్యా చందన



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, జూలై 11 (తీన్మార్ న్యూస్): వన మహోత్సవ లక్ష్యాలను సాధించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలంలో శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన మండలంలోని పలు గ్రామాలను సందర్శించి వన మహోత్సవ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఈ పర్యటనలో భాగంగా మైలవరం గ్రామంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. అనంతరం అదే గ్రామంలో రైతు లక్ష్మీనరసు పొలంలో మునగ సాగుకు ప్రోత్సాహం ఇస్తూ మునగ మొక్కను నాటి ప్రారంభం చేశారు. తర్వాత మైలారం గ్రామంలోని జెడ్‌పిఎస్ఎస్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి మునగ, వెలగా, ఉసిరి మొక్కలను నాటి విద్యార్థులలో పర్యావరణం పై మరియు ఔషధ మొక్కలపై అవగాహన కల్పించాలని అన్నారు. పాఠశాల ఆవరణంలో నిర్మించిన "కమ్యూనిటీ మ్యాజిక్ సోక్ పిట్" ను పరిశీలించి, శుభ్రత పట్ల అవగాహన కల్పించే విధంగా దీనిని వినియోగించుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందుతున్న పోషకాహారం, వృద్ధి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మైలవరం గ్రామపంచాయతీ పరిధిలోని నర్సరీను మరియు గట్టుమల్ల నర్సరీలను సందర్శించిన ఆమె మొక్కల లభ్యతను పరిశీలించారు. ఆయా నర్సరీల్లో వివిధ రకాల మొక్కల నిల్వలు, పంపిణీ విధానాలు, మొక్కల ఆరోగ్యం తదితర అంశాలను సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంపీ ఓ, పంచాయతీ కార్యదర్శులు, ప్లాంటేషన్ మేనేజర్ రాజు, ఏపీవో, ఈసీ, టి ఏ, ఎఫ్ ఏ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో నాలాల ఆక్రమణలపై హైడ్రా ఫోకస్

మొదటి పేజీ తరువాయి

ఆక్రమణలకు గురైంది. ముఖ్యంగా తుమ్మలబస్తీ ఆనందనగర్ మధ్య నాలా వెడల్పు 8 మీటర్లుండాల్సిన చోట 5 మీటర్లకు మాత్రమే పరిమితమైంది. దీంతో వర్షాకాలంలో వరదనీరు కాలనీల్లోకి చేరుతున్నట్టు స్థానికులు ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో అధికారులు పర్యటన నిర్వహించి, శ్రీధర్ ఫంక్షన్ హాల్ నిర్మించిన ఆక్రమణను తొలగించారు. కొన్ని చోట్ల నివాసితులు స్వయంగా నిర్మాణాలను తొలగిస్తామని హామీ ఇవ్వడంతో వారికి కొంత గడువు ఇచ్చారు. ఖైరతాబాద్ చౌరస్తా వద్ద నాలా ముఖద్వారాన్ని మూసివేసిన థర్మాకోల్ వ్యర్థాలను కూడా హైడ్రా తొలగించింది. కూకట్‌పల్లి ఐడీఎల్ చెరువు నుంచి ప్రారంభమైన నాలా కొన్ని ప్రాంతాల్లో 7 మీటర్ల వెడల్పు ఉండాల్సిన చోట కేవలం 2 మీటర్లకే పరిమితమైంది. హబీబ్‌నగర్, శ్రీహరినగర్, శివశక్తి నగర్ వంటి ప్రాంతాల్లో వరదనీరు తరచుగా చేరుతున్నది. ఈ కారణంగా ఎన్ఆర్సీ, ఎన్‌కేఎన్ఆర్ ఫంక్షన్ హాళ్ల యజమానులు ఆక్రమణలకు పాల్పడినట్టు గుర్తించి, హైడ్రా అధికారులు వాటిని దాదాపు 70 మీటర్ల మేర తొలగించారు. ఈ నాలా మూసాపేట మెట్రో స్టేషన్ దాటి కూకట్‌పల్లి నాలాలో కలుస్తుంది. మార్గమధ్యంలో వివిధ ప్రాంతాల్లో రెండు కిలోమీటర్ల పరిధిలో ఆక్రమణల తొలగింపు పనులు హైడ్రా చేపట్టింది. శివశక్తి నగర్ వద్ద నాలా కేవలం మీటరున్నరకు తగ్గిపోయిన నేపథ్యంలో అక్కడి నిర్మాణాలను కూడా తొలగించేందుకు చర్యలు ప్రారంభించారు.

వర్షాకాలంలో నగరంలోని పలు ప్రాంతాలు వరద ముప్పును ఎదుర్కొంటున్న నేపథ్యంలో, వాటిని నివారించేందుకు స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా సత్వర చర్యలు చేపట్టింది. ఆక్రమణల తొలగింపు ద్వారా వరద నీరు సాఫీగా వెళ్లేలా మార్గాలను క్లియర్ చేయడం ప్రారంభించడంతో నగర ప్రజల్లో స్వల్ప స్థాయిలో నమ్మకం ఏర్పడుతోంది. నాలాల విస్తరణ, అవరోధాల తొలగింపు చర్యలు కొనసాగుతున్న నేపథ్యంలో, హైడ్రా ముందు నిలిచిన సవాళ్లు ఎంతో ఉన్నప్పటికీ, ప్రజల సహకారం, అధికారుల నిబద్ధత ఉంటే పరిష్కారాలు సాధ్యమేనన్న నమ్మకం కనిపిస్తోంది.

# ఆపరేషన్ సింధూర్‌పై విదేశీ మీడియా దుష్ప్రచారం

**భారత్‌పై పాక్ దాడికి ఒక్క ఆధారమైనా చూపగలరా**

**లక్ష్యాలను ఛేదించడంలో భారత్ అసమాన ప్రతిభ**

**ఐఐటీ మద్రాస్ 62వ స్నాతకోత్సవంలో అజిత్ ధోవల్**



**చెన్నై :** ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ చేసిన దాడుల్లో భారత్‌కు నష్టం కలిగిందని విదేశీ మీడియా చేస్తున్న ప్రచారాలపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ ఆగ్రహం వ్యక్తంచేశారు. పాక్ దాడుల్లో భారత్‌కు నష్టం కలిగిందనే విషయాన్ని రుజువు చేయడానికి ఏ ఒక్క ఆధారాన్ని అయినా చూపాలని సవాలు విసిరారు. చెన్నైలోని ఐఐటీ మద్రాస్ 62వ స్నాతకోత్సవంలో డోభాల్ మాట్లాడుతూ, పాకిస్థాన్ లోపలకు వెళ్లి విజయవంతంగా 9 ఉగ్రవాద స్థావరాలపై భారత సైన్యం దాడులు జరిపిందని, ఒక్క టార్గెట్ కూడా మిస్ కాలేదని చెప్పారు. ఉగ్రవాదులు ఎక్కడున్నారనే కచ్చితమైన సమాచారంతో ఈ దాడులు జరిపామని చెప్పారు. భారతదేశ ఇంటెలిజెన్స్, కార్యాచరణ కచ్చితత్వాన్ని ఈ మిషన్ చాటిచెప్పిందని అన్నారు. కేవలం 32 నిమిషాల్లో ఈ ఆపరేషన్ పూర్తి చేసినట్టు- చెప్పారు. భారతదేశ వ్యూహాత్మక ఆపరేషన్ విశ్వసనీయతను ప్రశ్నించే వారు భారత్ వైపు నష్టం జరిగిందని చెప్పే ఒక్క ఫోటోనైనా చూపించాలని సవాలు చేశారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత సైన్యం పాక్‌లోని ఉగ్రస్థావరాలను ఎలా ధ్వంసం చేసిందనే విషయాలను వెల్లడించారు. ఈ ఆపరేషన్‌లో స్వదేశీ రక్షణ సాంకేతికతను వినియోగించి దాయాదికి ముచ్చెమటలు పట్టించామని అన్నారు. సోషల్ మీడియాలో విదేశీ వార్తాసంస్థలు ఆపరేషన్ సిందూర్‌పై ప్రచారం చేస్తున్న తప్పుడు కథనాలను డోభాల్ కొట్టిపడేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ అది చేసింది.. ఇది చేసిందంటూ విదేశీ మీడియా అసత్య కథనాలు ప్రసారం చేసిందని మండిపడ్డారు. ఆ దేశంలో ఉగ్రస్థావరాలు ఎక్కడెక్కడ ఉన్నాయనే అత్యంత కచ్చితమైన సమాచారంతోనే భారత సైన్యం దాడులు నిర్వహించిందన్నారు. పాకిస్థాన్‌లోని 13 వైమానిక స్థావరాలు ధ్వంసమైన ఫొటోలు మాత్రమే బయటకు వచ్చాయి కానీ.. భారత్‌కు నష్టం జరిగినట్లు ఒక్క ఫొటో కూడా లేదని వ్యాఖ్యానించారు. భారత్‌కు చెందిన ఆయుధ స్థావరాలపై దేశ సైన్యం చిన్నగీత కూడా పడనివ్వలేదని అన్నారు. భవిష్యత్తులో ఎదురయ్యే సమస్యలను, యుద్ధ పరిస్థితులను ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా రక్షణ రంగానికి అవసరమైన సాధన సంపత్తిని దేశీయంగానే రూపొందిస్తోందని డోభాల్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సుఖోయ్-30 ఎంకేఐ యుద్ధ విమానాల ద్వారా ప్రయోగించిన బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్థాన్ భూభాగాల లోపలి వరకూ వెళ్లి ఆ దేశానికి చెందిన పలు వైమానిక స్థావరాలను దెబ్బతీశాయ న్నారు. పాకిస్థాన్ సైన్యం ఢిల్లీ లక్ష్యంగా ప్రయోగించిన ఫతాహ్-11 బాలిస్టిక్ క్షిపణులను భారత బలగాలు... గగనతల రక్షణ వ్యవస్థ ఎస్-400తో మధ్యలోనే సమర్థమంతంగా పేల్చివేశాయని తెలిపారు.

## వంతెన కూలిన ఘటన

**17కు చేరిన మృతుల సంఖ్య**

**గాంధీనగర్,జులై 11 :** గుజరాత్‌లోని వడోదర జిల్లాలో మహిసాగర్ నదిపై గంభీర వంతెన కూలిపోయిన ఘటనలో మృతుల సంఖ్య 17కి పెరిగింది. మరో ముగ్గురు వ్యక్తుల కోసం సహాయక బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. బుధవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో పద్రా పట్టణానికి సమీపంలోని గంభీర గ్రామం వద్ద ఈ సంఘటన జరిగింది. ఆనంద్, వడోదర జిల్లాలను కలిపే నాలుగు దశాబ్దాల నాటి వంతెనలోని ఒక భాగం ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో పలు వాహనాలు నదిలో పడిపోయాయి. వడోదర కలెక్టర్ అనిల్ ధమేలియా మాట్లాడుతూ..ఇతర ఏజెన్సీల నుండి 10 బృందాలు సహాయక చర్యలలో నిమగ్నమై ఉన్నాయి. ట్రక్కుతో సహా పలు వాహనాలు నది గర్భ బురదలో చిక్కుకున్నాయి. దీంతో వాహనాలను బయటకు తీసుకొచ్చేందుకు కష్టంగా మారింది. ఇప్పటివరకు 17 మంది బాధితుల మృతదేహాలను వెలికితీశారు. మరో ఐదుగురు గాయపడిన వ్యక్తులు ప్రస్తుతం కోలుకుంటు-న్నారు. త్వరలో ఆసుపత్రి నుండి డిశ్చార్జ్ అవుతారని చెప్పారు. వంతెన కూలిపోయిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ గురువారం రాష్ట్ర రోడ్లు, భవనాల విభాగానికి చెందిన నలుగురు ఇంజనీర్లను సస్పెండ్ చేశారు. సస్పెండ్ చేయబడిన వారిలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్‌ఎమ్ నాయకవాలా, డిప్యూటీ- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు యుసి పటేల్, ఆర్టి పటేల్, అసిస్టెంట్ ఇంజనీర్ జెవి షా ఉన్నారు. ఈ ఘటనతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని వంతెనలను వెంటనే తనిఖీ చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

## కోయంబత్తూరు పేలుళ్ల కేసు

**ఎట్టకేలకు ప్రధాన నిందితుడి పట్టివేత**

**బెంగళూరు,జులై 11 :** 1996 కోయంబత్తూరు బాంబు పేలుళ్ల కేసులో దాదాపు మూడు దశాబ్దాలుగా తప్పించుకుని తిరుగుతున్న ప్రధాన నిందితుడు, సీరియల్ కిల్లర్ సాదిక్ రాజా అలియాస్ -టైలర్ రాజాను ఎట్టకేలకు అరెస్టు చేశారు. కర్ణాటకలోని విజయపురలో తప్పుడు గుర్తింపుతో నివసిస్తున్న అతన్ని కోయంబత్తూరు పోలీసులు పట్టు-కున్నారు. చామరాజనగర్ జిల్లాలోని గుండ్లుపేటకు చెందిన సాదిక్ రాజా 1996 పేలుడు తర్వాత పరారీలో ఉన్నాడు. పోలీసు వర్గాల ప్రకారం.. నిందితుడు ఒకే చోట ఉండకుండా పలు రాష్ట్రాలకు మారుతూ తప్పించుకు తిరిగాడు. మొదట తమిళనాడు నుండి బెంగళూరుకు, తరువాత హుబ్బళ్లికి, చివరికి విజయపురలో స్థిరపడ్డాడు. గత 12 సంవత్సరాలుగా, అతను కూరగాయల వ్యాపారిగా పనిచేస్తూ, మారు పేరుతో నివసిస్తూ, తక్కువ ప్రొఫైల్ జీవితాన్ని గడిపాడు. అతను హుబ్బళ్లిలో ఒక స్థానిక మహిళను కూడా వివాహం చేసుకున్నాడు. ఇది అతను సమాజంలో కలిసిపోవడానికి మరింత సహాయపడింది. సాదిక్ రాజా 1996 కోయంబత్తూరు పేలుడులో పాల్గొనడమే కాకుండా.. మధురై, నాగూర్ పేలుళ్లతో సహా ఇతర ప్రధాన సంఘటనలలో కూడా పాత్ర పోషించాడని దర్యాప్తులో వెల్లడైంది. అతనిని గుర్తించకుండా ఉండటానికి.. తన పేరు, గెటప్, నివాసాన్ని మారుస్తూ తిరిగినట్లు- పోలీసులు నిర్ధారించారు. చివరికి.. కోయంబత్తూరు పోలీసులు పక్కా విశ్వసనీయ నిఘా సమాచారం ఆధారంగా రంగంలోకి దిగి అరెస్టు చేశారు. చివరి దశ వరకు విజయపురలోని స్థానిక పోలీసులకు కూడా వివరాలను దాచిపెట్టి, ఈ ఆపరేషన్ అత్యంత రహస్యంగా నిర్వహించారు. తమిళనాడు ఉగ్రవాద నిరోధక దళం, కోయంబత్తూరు నగర పోలీసుల సంయుక్త బృందం ఈ ఆపరేషన్‌కు నాయకత్వం వహించింది. ఈ ఆపరేషన్ లో పాల్గొన్న ఒక సీనియర్ పోలీసు అధికారి మాట్లాడుతూ.. 'అరెస్టు నుంచి తప్పించుకునేందుకు సాదిక్ తన పేరు, నివాసాన్ని మార్చుకుంటూనే ఉన్నాడు. సంవత్సరాల తరబడి ట్రాక్ చేసిన తర్వాత, మేము చివరికి అతను ఉండే ప్రాంతాన్ని గుర్తించాం. విచారణ, ఇతర నిందితుల నుండి వచ్చిన ఇన్‌పుట్‌ల ద్వారా అతన్ని పట్టు-కున్నాం' అని చెప్పారు. సాదిక్ రాజాను అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ కోసం తమిళనాడుకు తరలించారు. 29 ఏళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న నిందితుడిని పట్టు-కోవడంలో కీలక పాత్ర పోషించిన 2023లో స్థాపించబడిన ఉగ్రవాద నిరోధక దళాన్ని ముఖ్యమంత్రి ఎం కె స్టాలిన్ అభినందించారు.

## హామీని నిలబెట్టుకున్న నేత రేవంత్ రెడ్డి

**42శాతం బిసి రిజర్వేషన్లతో సామాజనిక న్యాయం**

**దేశంలో తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోంది**

**రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి ప్రశంసలు**




**ఖమ్మం,జులై 11 :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడం ద్వారా సిఎం రేవంత్ రెడ్డి తన మాటను నిలబెట్టుకున్న నాయకుడిగా నిలిచాడని రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి అన్నారు. ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాజీ కేంద్రమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంశంపై ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డిని ప్రశంసలతో ముంచెత్తారు. ఇది రాజకీయ నిర్ణయం కాదని, సామాజికంగా గొప్ప మార్పునకు నాంది అని అభివర్ణించారు. అలాగే, ఇవ్వాళ నాకు చాలా గర్వంగా ఉంది. దేశవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తోంది. రాష్ట్ర ప్రజలందరికీ గర్వపడే రోజులు ఇవని రేణుక పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో సామాజిక న్యాయం సాధ్యమవుతోందని తెలిపారు. ఎవరెవరో మాటలు చెప్పారు కానీ.. చేసి చూపించింది మాత్రం సీఎం రేవంత్ రెడ్డి అంటూ ఆమె స్పష్టం చేశారు. గురువారం జరిగిన కేబినెట్ తీసుకున్న 42శాతం బీసీ రిజర్వేషన్ నిర్ణయం వల్ల వారికి రాజకీయాల్లోనే కాదు.. ఉద్యోగాల్లోనూ మెరుగైన అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ ఒక్క సంతకంతో మహిళల జీవితాలను మార్చారు. ఆయన తీసుకున్న నిర్ణయాలతో భర్తలు కూడా గౌరవం చూపించారు. ఇప్పుడు రాహుల్ గాంధీ హయంలో బీసీలకు చరిత్ర సృష్టించే నిర్ణయం తీసుకున్నారు. 42 శాతం రిజర్వేషన్ దేశానికే మార్గదర్శిగా నిలుస్తుందని ఆమె అన్నారు. ఈ నిర్ణయం జాతీయ స్థాయిలో చర్చనీయాంశంగా మారింది. నాకు దేశవ్యాప్తంగా మెసేజ్‌లు వస్తున్నాయి. ప్రజలు, కార్యకర్తలు ఎంతో ఉత్సాహంతో ముందుకు వస్తున్నారు. న్యాయం చేయగలిగే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమే అని రేణుకా చౌదరి అన్నారు. మరోవైపు బీఆర్ఎస్ పార్టీపై ఆమె విమర్శలు గుప్పించారు. వాళ్లు పూటకోసారి పార్టీ పేరు మారుస్తుంటారు. కేసీఆర్ ఆరోగ్యం బాగుండాలి.. ఎందుకంటే వాళ్లు అలాగే ఉన్నప్పుడు మేము అధికారంలో ఉంటాం. బీఆర్ఎస్‌లో గ్రూపులు ఉన్నాయి. ఎమ్మెల్సీ కవిత గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది అని వ్యాఖ్యానించారు. ఇన్ని సంవత్సరాలు నాయకులు చెప్పినవి సొల్లు కబుర్లే.. కానీ ఇప్పుడు రాష్ట్రానికి అసలైన సీఎం లభించడమే గొప్ప విషయం. రేవంత్ రెడ్డి చేసిన నిర్ణయం దేశానికి మార్గం చూపుతుంది. చేతి గుర్తు అన్నది దేశాన్ని ముందుకు నడిపే సత్తా ఉన్న చిహ్నం అని అన్నారు.

## కర్నాటక ప్రభుత్వం కీలక నిర్ణయం

**స్కూలు విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం**

**వెల్లడించిన డిప్యూటి సిఎం శివకుమార్**



**బెంగళూరు,జులై 11 :** కర్ణాటక ప్రభుత్వం విద్యార్థులకు గుడ్ న్యూస్ చెప్పింది. కర్ణాటక పబ్లిక్ స్కూల్స్ సహా ప్రభుత్వ పాఠశాలల్లో లోయర్ కిండర్ గార్టెన్ నుండి ప్రీ-యూనివర్శిటీ- కోర్సు వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచిత బస్సు సర్వీసును ప్రకటించింది. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి శివకుమార్ ఉచిత బస్సుపై ప్రకటన చేశారు. మారుమూల, వెనుకబడిన ప్రాంతాల పిల్లలకు ప్రయాణ ఖర్చులను తగ్గించడం, పాఠశాల హాజరును పెంచడం లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపారు. ఈ సేవ విద్యార్థులు విద్యను పొందడాన్ని సులభతరం చేయడమే కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు, సమయపాలన, మొత్తం విద్యా పనితీరును మెరుగుపరు-స్తుందని ప్రభుత్వం విశ్వసిస్తుందని చెప్పారు. ఈ మేరకు ఎక్స్ వేదిగా.. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది! ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కర్ణాటక ప్రభుత్వ పాఠశాలల్లో రజౌఏ నుండి ÷ఖఈ వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచిత బస్సు సర్వీసును ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని డిప్యూటీ- సిఎం శివకుమార్ చెప్పారు.

## బలూచీలో దారుణం

**9 మంది ప్రయాణికుల కాల్చివేత**

**లాహోర్ :** బస్సులో ప్రయాణిస్తున్న వారిలో తొమ్మిది మందిని కిందకు దించి దారుణంగా కాల్చి చంపారు. ఈ సంఘటన పాకిస్తాన్‌లోని అల్లకల్లోల బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో చోటుచేసుకుంది. ప్రావిన్స్‌లోని జోబ్ ప్రాంతంలో జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం ప్రయాణీకుల బస్సు నుండి పంజాబ్‌కు చెందిన తొమ్మిది మంది ప్రయాణికులను దింపి.. తిరుగుబాటు-దారులు కాల్చి చంపారని అసిస్టెంట్ కమిషనర్ జోబ్ నవీద్ ఆలం తెలిపారు. క్వెట్టా నుండి లాహోర్‌కు వెళ్తున్న బస్సును ఆపి ప్రయాణికుల ఐడి కార్డులను తనిఖీ చేసి.. వారిలో తొమ్మిది మందిని కిందకు దింపి కాల్చి చంపారు. మృతులు పంజాబ్ ప్రావిన్స్‌లోని వివిధ ప్రాంతాలకు చెందినవారిగా గుర్తింపు. తొమ్మిది మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ఆసుపత్రికి తరలించారని ఆయన అన్నారు.

## మోహన్ భగవత్ 75 ఏళ్ల రిటైర్మెంట్ వ్యాఖ్యలు

**మోడీని ఉద్దేశించి చేసినవే నంటూ కాంగ్రెస్ నొక్కుళ్లు**

**భగవత్, మోడీ ఇద్దరూ 75కు చేరువలో ఉన్నారన్న జైరామ్**

**న్యూఢిల్లీ :** రాజకీయ నేతలు ఎవరైనా సరే 75 ఏళ్లు రాగానే రిటైర్మెంట్ తీసుకోవాలంటూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశ మవుతున్నారు. దీనిపై కాంగ్రెస్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా రంగంలోకి దిగింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉద్దేశించే మోహన్ భాగవత్ ఈ వ్యాఖ్యలు చేశారని విమర్శలు గుప్పించింది. మోహన్ భాగవత్ గత బుధవారంనాడు నాగపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ.. రిటైర్మెంట్‌పై మరాఠా సామ్రాజ్య మొదటి పీష్వా, సంఘ్ సిద్ధాంతకర్త మోరోపంత్ పింగ్లే అభిప్రాయాన్ని ప్రస్తావించారు. 75 ఏళ్ల శాలువా మన మీద కప్పారంటే.. మనం ఒక నిర్దిష్ట వయసుకు చేరుకున్నామని అర్థం. అప్పుడు మనం పక్కకు జరిగి.. వేరే వాళ్లు పనిచేసేందుకు అవకాశం ఇవ్వాలని పింగ్లే వ్యాఖ్యలను భాగవత్ గుర్తుచేశారు. ఇది కాస్తా నెట్టింట చర్చనీయాంశంగా మారింది. ఈ ఏడాది సెప్టెంబరుతో ప్రధాని మోదీకి 75 ఏళ్లు నిండుతాయి. ఆయనను ఉద్దేశించే భాగవత్ ఈ వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. పలు అవార్డులు తీసుకొని, విదేశీ పర్యటనలు ముగించుకుని వస్తున్న ప్రధాని మోదీకి ఎలాంటి స్వాగతం లభించిందో చూడండి..! ఈ ఏడాది సెప్టెంబరు 17 నాటికి మోదీకి 75 ఏళ్లు పూర్తవుతాయనే విషయాన్ని ఆర్ఎస్ఎస్ చీఫ్ గుర్తుచేస్తున్నారు. కానీ, భాగవత్‌కు కూడా ఈ ఏడాది సెప్టెంబర్ 11 నాటికి 75 ఏళ్లు నిండుతాయనే విషయాన్ని మోదీ గుర్తు చేయాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి జైరాం రమేశ్ పోస్ట్ పెట్టారు. 'ఒక్క దెబ్బకు.. రెండు పిట్టలు' అంటూ ఎద్దేవా చేశారు. ఈ ఏడాది మార్చిలో ప్రధాని మోదీ నాగ్‌పూర్‌లోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించిన సంగతి తెలిసిందే. ఆ సమయంలోనే మోదీ రి-టైర్మెంట్ గురించి చర్చ మొదలైంది. అప్పట్లో దీనిపై శివసేన (యూబీటీ-) ఎంపీ సంజయ్-రౌత్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గత 10, 11 ఏళ్లలో మోదీ ఎన్నడూ ఈ కార్యాలయానికి రాలేదు. దేశ నాయకత్వంలో మార్పు రావాలని ఆర్ఎస్ఎస్ కోరుకుంటోంది. ఆ సంస్థ నియమాల ప్రకారం మోదీ కూడా రాజకీయాలకు రిటైర్మెంట్ ప్రకటించాలని సంఘ్ భావిస్తోందని నాడు రౌత్ వ్యాఖ్యానించారు. అయితే, దీన్ని భాజపా కొట్టిపారేసింది. ఇప్పుడు భాగవత్ వ్యాఖ్యలతో మరోసారి ఈ అంశం తెరపైకి వచ్చింది.

## ఢిల్లీలో వరుసగా రెండో రోజూ ప్రకంపనలు

**న్యూఢిల్లీ :** ఢిల్లీలో మరోసారి భూకంపం వచ్చింది. శుక్రవారం ఢిల్లీ ఎన్ సీఆర్ లో భూప్రకంపనలు సంభవించాయి. దీంతో జనం ఇండ్లలోంచి బయటికి పరుగులు పెట్టారు. భూకంప హర్యానాలోని ఝజ్జర్ కేంద్రంగా 10 కిలోమీటర్ల లోతులో సంభవించిందని నేషనల్ సెంటర్ ఆఫ్ సిస్మోలజీ (కఈఃూ) తెలిపింది. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ఈ వారంలో ఈ ప్రాంతాన్ని తాకిన రెండవ భూకంపం ఇది. గురువారం కూడా దేశ రాజధాని ఢిల్లీలో భూకంపం జనానాలను భయభ్రాంతులకు గురి చేసింది. ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్, గురుగ్రామ్, భివానీ, ఝజ్జర్, బహదూర్‌గఢ్ సహా అనేక నగరాల్లో భూకంప ప్రకంపనలు సంభవించాయి. భూకంపం హర్యానాలోని ఝజ్జర్ కేంద్రంగా భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.1గా నమోదైనట్లు- అధికారులు అంచనా వేశారు.

## యానాంలో చిక్కిన పులస

**కేజీ 15 వేలు పలికిన ధర**

**కాకినాడ :** పుస్తెలు అమ్మైనా సరే.. పులస తినాలి' అనే నానుడి గోదావరి జిల్లాలో బాగా వినిపిస్తుంటుంది. 'పులస' చేప దొరకడం చాలా అరుదు కాబట్టే.. జీవితంలో ఒక్కసారైనా పులసను తినాలని భావిస్తుంటారు. నదీ ప్రవాహానికి అతి వేగంగా ఎదురీదడం ఈ చేప ప్రత్యేకత. అంతేకాదు ఈ చేప ఎంతో రుచికరంగా కూడా ఉంటుంది. అందుకే వేలంలో ఎంత ధర పెట్టడానికైనా జనాలు వెనుకాడరు. ఇప్పటికే ఎన్నో పులస చేపలు రికార్డు ధరలో అమ్ముడుపోయాయి. గోదావరి నదికి వరదలు వచ్చే సమయంలో పులస చేపల సీజన్ ఆరంభం అవుతుంది. ఈ ఏడాది కూడా గోదావరికి వరద నీటి తాకిడి పెరిగింది. దాంతో పులస చేపల సీజన్ మొదలైంది. ఎర్ర నీరు ఉధృతంగా రావడంతో పులసలు ఎదురీదుతూ వస్తున్నాయి. ఇప్పటికే గోదావరి తీరానికి సమీపంలో ఉండే యానాం ప్రాంతంలో తొలి పులస చేప చిక్కింది. మూడు రోజుల క్రితం యానాం ఫిష్ మార్కెట్‌లో పులస రూ.4000 ధర పలికింది. శుక్రవారం మరో పులస చేప మత్స్యకారులకు దొరికింది. పులస ప్రియులు వేలంలో పోటీ- పడ్డారు. దాంతో కేజీ ధర రూ.15000 పలికింది. యానాంలో పులసల సందడి మొదలవడంతో మత్స్యకారుల పంట పండుతోంది.

## బతుకుదెరువు కోసం గల్ఫ్‌కు వెళ్లి మృత్యువాత

**నిజామాబాద్,జులై 11 :** ఇందల్వాయి మండల కేంద్రంలోని ఇందల్వాయి గ్రామానికి చెందిన నీరడి భోజన్న (45) బతుకుదెరువు కోసమని 15 రోజుల క్రితం గల్ఫ్ దేశానికి వెళ్లాడు. అక్కడ మృత్యువు అతనిని అనారోగ్యంతో కాటేసింది. తమ ఇంటి పెద్ద మృత్యువాత పడిన విషయాన్ని విన్న కుటు-ంబ సభ్యులు రోదనలతో విలపిస్తున్నారు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు. మృతుడి తల్లి రోదిస్తూ దేశం కాని దేశంలో అనారోగ్యంతో మరణించిన తమ కొడుకు మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక ఎంఎల్ఏ డాక్టర్ భూపతిరెడ్డి చొరవ చూపాలని వేడుకొంది. మృతుడు ఆర్థిక పరిస్థితుల వల్లనే దుబాయ్ బాట పట్టాల్సి వచ్చిందని అతని భార్య రోదిస్తూ తెలిపింది.. ప్రభుత్వం స్పందించి తమ కుటు-ంబానికి న్యాయం చేసేవిధంగా సహకరించాలని కుటు-ంబ సభ్యులు వేడుకొంటు-న్నారు. కాగా, ఇందల్వాయి మాజీ సర్పంచ్ బాధిత కుటు-ంబ ఆర్థిక పరిస్థితులను చూసి 5 వేల రూపాయలు విరాళంగా అందజేశారు.




# మానవ వనరుల వినియోగంలో వైఫల్యం!

జనాభా పెరుగుదల అన్నది అభివృద్ధికి సూచిక కానేకాదు. జనాభా వల్ల వనరులు తగ్గుతాయి. ఆర్థిక భారం పడుతుంది. భారత్ లాంటి ప్రజాస్వామ్య దేశంలో జనాభా వల్ల ఖజానాపై అత్యధిక భారం పడుతుంది. ఎందుకంటే వీరందరికి పెన్షన్లు ఇవ్వాలి. కిలోరూపాయి బియ్యం పథకం అమలు చేయాలి. ఇంట్లో ఎందరు ఉంటే అంతమందికి బియ్యం ఇవ్వాలి. ఎందరుంటే అంతమందికి పెన్షన్లు ఇవ్వాలి. వీరుమాత్రం దర్జాగా ప్రభుత్వ పథకాలతో కాలక్షేపం చేస్తూ బలాదూర్‌గా తిరుగుతున్నారు. ఇప్పటికే ఏ రంగంలోనయినా కూలీల కొరత తీవ్రంగా ఉంది. జనాభా ఉన్నాకూలీలు దొరకని దేశం ఒక్క భారత్ మాత్రమే అయివుంటుంది.

జనాభాను ఉపయోగించి వస్తూత్పత్తి చేసి, ఎగుమతులు చేయడం ద్వారా పటిష్ట ఆర్థిక విధానాలు అమలు చేసే ప్రణాళికలు భారత దేశంలోని ప్రభుత్వాల వద్ద లేవు. చైనాలాంటి దేశాలు అధిక జనాభాను కూడా ఆర్థిక ఉత్పత్తికి కేంద్రాలుగా ఉపయోగించుకుంటున్నాయి. ప్రజలందరికి పని కల్పించి, వారితో వస్తూత్పత్తిని ప్రోత్సహిస్తున్నారు. దాంతో విదేశాలకు ఎగుమతులు పెంచి ఆర్థికంగా బలపడుతున్నారు. కానీ భారత్‌లో అది సాధ్యం కావడం లేదు. ఇప్పటికే వ్యవసాయానికి కూలీలు దొరకడం లేదు. పనులు చేసేందుకు ఎవ్వరూ ముందుకురావడంలేదు. పనిచేయకున్నా పస్తులుండే పరిస్థితులు లేవు. ఎందుకంటే ప్రభుత్వం ఏదోరకంగా ఏదో ఒక పథకంతో ఆదుకుంటోంది. లేదా రాజకీయ పార్టీల జెండాలు మోస్తే వారే మందు, బిర్యానీలు సరఫరా చేస్తుంటారు. ఇలా మానవవనరులను వృధా చేసుకుంటున్న ఏకైక దేశం భారత్ మాత్రమేనని చెప్పడంలో వెనకాడాల్సిన పనిలేదు. దీనికంతటికీ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే కారణం. ఉచిత పథకాలతో ప్రజలను సోమరులుగా తయారు చేస్తున్నారు. అందువల్ల వారు పనిచయడానికి ఇష్టపడడం లేదు. ప్రభుత్వ పథకాలు ఏవేవి వస్తున్నాయో లెక్కలు కట్టి మరీ రాబట్టు కుంటున్నారు. దీంతో వారు కాయకష్టం చేయడానికి ఇష్టపడడం లేదు. భారతదేశంలో 140 కోట్ల జనాభా ఉన్నా ప్రతిరంగంలోనూ కార్మికుల కొరత ఉంది. అందరూ వైట్ కాలర్జాబ్‌లే చేయాలనుకుంటున్నారు. స్వయం ఉపాధి రంగాలపై శ్రద్ధ చూపడం లేదు. ఆయా రంగాలకు రుణాలు ఇచ్చి ప్రోత్సహించేలా ప్రభుత్వ విధానాలు ఉండడం లేదు. ఉదాహరణకు కోళ్ల పెంపకానికి డిమాండ్ ఉంది. అలాగే పాడిపరిశ్రమకునిత్యం డిమాండ్ ఉంది. గొర్రెలు, చేపల పెంపకానికి కూడా డిమాండం ఉంది. ఈ రంగాల్లో స్వయం సమృద్ధితో ఉపాధి పొందవచ్చు. కానీ యువత అందుకు సిద్దంగా లేదు. ఈ క్రమంలో జనాభా పెరగాలని రష్యా లాంటి దేశాలు ఆరాటపడు తున్నాయి. భారత్ లాంటి దేశాలు వద్దు బాబోయం అంటున్నాయి. కొన్ని దేశాలు ఇప్పటికే అధిక జనాభాతో సతమతమవుతూ..జనాభా నియంత్రణ చర్యలు పాటిస్తున్నాయి. మరికొన్ని దేశాలు జనాభా పెరుగుదలకు ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. గతంలో జనాభా నియంత్రణను కఠినంగా అమలు చేసిన దేశాలు కూడా ఇప్పుడు ఆ నిబంధనను సడలిస్తున్నాయి. భారతదేశంలోని కొన్ని రాష్ట్రాల పరిస్థితులు కూడా ఇలాగే ఉన్నాయి. జనాభా పెరగాలని ఎపి సిఎం చంద్రబాబు లాంటి వారు కోరుకుంటున్నారు. యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ లాంటి రాష్ట్రాలు ఇప్పటికీ జనాభా నియంత్రణకు ప్రాధాన్యమిస్తుండగా, దక్షిణాదికి చెందిన ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, కర్ణాటక, తెలంగాణ వంటి రాష్ట్రాలు జనాభా పెరుగుదలను ప్రోత్సహించే దిశలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో జనాభా అనేది ప్రధాన సమస్య కాదని, ప్రభుత్వాల వద్ద సరైన ప్రణాళికలు లేకపోవడమే అసలు కారణమని తెలుస్తున్నది. జనాభా పెరగాలంటున్న చంద్రబాబు లాంటి వారివద్ద సరైన ప్రణాళికలు లేవు. ఉన్న జనాభాను ఎలా వినియోగించుకోవాలో తెలియదు. ఇప్పటికే ఖజానా భారంగా మారినా ఊరూరా పెన్షన్ల పంపిణీని జాతరలా కొనసాగి స్తున్నారు. ఇదంతా

కేవలం రాజకీయ ప్రయోజనాలు ఆశించి చేస్తున్నదే తప్ప మరోటి కాదు. సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకొని, సరైన ప్రణాళికలతో జనాభాను వినియోగించుకుంటే దేశంలో అద్భుత ఫలితాలు సాధించవచ్చు. వస్తూత్పత్తని పెంచవచ్చు. వ్యవసాయక దేశమైన భారత్‌లో తిండిగింజలను పండించవచ్చు. వనరులను ఉపయోగించుకుని వ్యవసాయంలో ఆర్థిక విప్లవం తీసుకుని రావచ్చు. కానీ ఇలా ఆలోచన చేసే నేతలు దేశంలో లేరు. 140 కోట్ల జనాభాతో ప్రపంచంలో భారతదేశం మొదటి స్థానంలో ఉండగా, చైనా రెండో స్థానంలో ఉన్నది. జనాభా పెరుగుదల సమస్యలు దేశాల ఆర్థిక, సామాజిక, పర్యావరణంపై ఆధారపడి ఉంటాయి. సరైన ప్రణాళిక లేనప్పుడు జనాభా పెరుగుదల ఒత్తిడిని సృష్టిస్తుంది. వనరులను దెబ్బతీస్తుంది. పర్యావరణ విధ్వంసానికి కారణం అవుతుంది. అయితే సమర్థవంత మైన విధానాలతో ఈ సవాళ్లను అధిగమించవచ్చు. జనాభాను ఉపయోగించుకోవడం అన్నది నేతల సమర్థతకు పరీక్ష లాంటిది. అధిక జనాభా ఉన్నా కొన్ని దేశాలు సరైన ప్రణాళికలతో అభివృద్ధిపథంలో దూసుకు పోతున్నాయి. అందుకు చైనా మన కళ్లముందు కనిపిస్తున్న ఉదాహరణ. అధిక జనసాంద్రత ఉన్నప్పటికీ సింగపూర్ సమర్థవంతమైన ప్రణాళిక ద్వారా ఆర్థిక, సామాజిక అభివృద్ధిని సాధించింది. ప్రపంచంలో జనసాంద్రత పరంగా సింగపూర్ మూడో స్థానంలో ఉంది. ఈ దేశ వైశాల్యం 719.9 చదరపు కిలోమీటర్లు కాగా, చదరపు కిలోమీటర్‌కు 8,595 మంది నివసిస్తున్నారు. అధిక ఆర్థిక వృద్ధి, అత్యుత్తమ గృహనిర్మాణం, ఆరోగ్య సేవలతో ప్రపంచంలోనే ఈ దేశం అగ్రగామిగా ఉంది. జనసాంద్రత పరంగా చైనా ప్రపంచవ్యాప్తంగా 83వ స్థానంలో ఉంది. 1980 నుంచి 2015 వరకు చైనా వన్ చైల్డ్ పాలసీని అమలు చేసి, దాదాపు 40 కోట్ల జనాభాను నియంత్రించింది. ఆర్థిక సంస్కరణలు తీసుకువచ్చిన ఆ దేశం జనాభా వనరులను సమర్థవంతం గా ఉపయోగించింది. ఫలితంగా చైనా రెండో అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగింది. ప్రపంచంలోని ఇతర దేశాలతో పోల్చుకుంటే భారతదేశంలో 35 ఏళ్లలోపు యువ జనాభా 65 శాతం ఉంది. ఈ జనాభాను పనివిధానంలోకి మారిస్తే అద్భుతాలు సాధించవచ్చు. ఇది సరైన ప్రణాళికతో ఆర్థిక వృద్ధికి దోహదపడు తుంది. ఎగుమతి ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా యువ జనాభాను ఉత్పాదక శక్తిగా మార్చవచ్చు. అయితే ఇప్పటి వరకు ఏ రాష్ట్రం లేదా కేంద్రం ఇలాంటి ఆలోచనలు చేయలేదు. ప్రజాస్వామ్యంలో ఓటు ప్రధానం కనుక అటువైపే ప్రణాళికలు ఉంటున్నాయి. ఈ దుస్థితి పోవాలంటే జనాభాను తగ్గించుకోక తప్పదు.

# ఇంధన సరఫరా స్విచ్‌లు ఆఫ్ అయ్యాయా

## ఎయిరిండియా ప్రమాదంపై వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం



**వాషింగ్టన్ :** ఎయిర్ ఇండియా విమానం ఏఐ-171 ప్రమాదంలో ఇంధన సరఫరా స్విచ్‌లను ఆఫ్ చేసినట్లు సందేహాలను వ్యక్తంచేస్తూ అమెరికా పత్రిక వాల్‌స్ట్రీట్ జర్నల్ కథనం పేర్కొంది. విమానం గాల్లోకి ఎగిరే సమయంలో స్విచ్‌లు సాధారణంగానే ఉన్నట్లు వాల్‌స్ట్రీట్ చెబుతోంది. అవి ఎలా ఆఫ్ అవుతాయనే విషయాన్ని నిపుణులు స్పష్టంగా చెప్పలేకపోతున్నారు. వీటిని ఉద్దేశపూర్వకంగా ఆపారా..? తిరిగి ఆన్ చేయడానికి ప్రయత్నించారా అనే అంశాన్ని వారు స్పష్టంగా చెప్పలేకపోతున్నారని వెల్లడించింది. స్విచ్‌లు ఆఫ్ అయితే మాత్రం ర్యాట్ ఎందుకు యాక్టివేట్ అయిందో చెప్పే అవకాశం ఉంది. అమెరికా అధికారుల అంచనాలను ఉటంకిస్తూ ఈ విషయాన్ని వెల్లడించింది. విమానంలోని జీఈ సంస్థకు చెందిన రెండు జెట్ ఇంజిన్లు సక్రమంగానే పనిచేస్తున్నట్లు పేర్కొంది. ఇంధనం సరఫరా చేసే స్విచ్‌లు ఆఫ్ అయి ఉంటాయని అమెరికా నిపుణులు అభిప్రాయపడుతున్నట్లు- పేర్కొంది. దీంతో టేకాఫ్ అయిన వెంటనే హఠాత్తుగా విమానం థ్రస్ట్‌ను కోల్పోయి ఉండొచ్చని పేర్కొంది. సాధారణంగా విమానం ఇంజిన్లను స్టార్ట్ చేయడం లేదా షట్‌డౌన్ చేయడానికి, కొన్ని అత్యవసర సందర్భాల్లో రీసెట్ కోసం వాడుతుంటారు. మరోవైపు భారత్‌కు చెందిన ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో ప్రస్తుతం దీనిపై దర్యాప్తు చేస్తోంది. ప్రాథమిక నివేదిక అతిత్వరలో విడుదల కావచ్చన్న అంచనాలు ఉన్నాయి. అమెరికా నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ ప్రస్తుతం భారత దర్యాప్తునకు సహకారం అందిస్తోంది. అయితే, భారత ప్రభుత్వం ఇతర దేశాలకు డేటాను షేర్ చేయడంలో అభిప్రాయబేధాలున్నట్లు- వాల్‌స్ట్రీట్ చెబుతోంది. ఈ ప్రమాదంపై అమెరికా అధికారులు ఆ పత్రికతో మాట్లాడుతూ విమానం మోడల్, లేదా జీఈ ఇంజిన్లతో దుర్ఘటనకు సంబంధం లేదని దర్యాప్తు సూచిస్తున్నట్లు వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు ఎఫ్ఏఏ లేదా బోయింగ్, జీఈలు ఎటువంటి సర్వీస్ బులెటిన్‌ను విడుదల చేయలేదన్నారు. మరోవైపు వైమానిక రంగానికి చెందిన పత్రిక 'ది ఎయిర్ కరెంట్' కూడా ఈ ప్రమాద దర్యాప్తు మొత్తం ఇంధన కంట్రోల్ స్విచ్‌ల చుట్టూనే తిరిగినట్లు పేర్కొంది. దర్యాప్తు ముందుకుసాగే కొద్దీ చేరే కొత్త సమాచారంతో ఈ అంచనాలు, అభిప్రాయాలు మారుతుంటాయని వెల్లడించింది.

ఈ ప్రమాదంపై ఇప్పటివరకు జరిపిన విశ్లేషణ, దర్యాప్తు ఆధారంగా ఏఏఐబీ ప్రాథమిక నివేదిక రూపొందించింది. దాన్ని కేంద్ర పౌరవిమాన మంత్రిత్వశాఖతో పాటు సంబంధిత ఇతర అధికారులకు సమర్పించినట్లు ప్రభుత్వ ఉన్నతస్థాయి వర్గాలు వెల్లడించాయి. జూన్ 12న ఈ దుర్ఘటన చోటుచేసు కోగా.. ఆ మరుసటిరోజే ప్రమాదంపై దర్యాప్తునకు ఏఏఐబీ ప్రత్యేక కమిటీని ఏర్పాటు-చేసింది. దీనికి ఏఏఐబీ డైరెక్టర్ జనరల్ జీవీజీ యుగంధర్ నేతృత్వం వహిస్తుండగా.. ఏవియేషన్ మెడిసిన్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ నిపుణులు, అమెరికాకు చెందిన నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు నిపుణులు సభ్యులుగా ఉన్నారు. ప్రమాదానికి గురైన విమానం నుంచి సేకరించిన బ్లాక్‌బాక్స్‌లను ఏఏఐబీ ల్యాబ్‌కు తరలించారు. డేటాను విజయవంతంగా డౌన్‌లోడ్ చేసి ప్రమాదానికి గల కారణాలను విశ్లేషిస్తున్నారు.

# రష్యా నుంచి చమురు దిగుమతులు

**ఓ రకంగా ప్రపంచ ఆర్థికానికి మేలు జరిగింది**

**కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి**




**న్యూఢిల్లీ :** రష్యా నుంచి చమురు కొనడం ద్వారా భారత్ ప్రపంచానికి మేలు చేసిందని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి తెలిపారు. ఓరకంగా భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మేలు చేసిందని అన్నారు. లేదంటే అంతర్జాతీయ మార్కెట్లో ధరలు ఆకాశన్నంటేవని తెలిపారు. ఉక్రెయిన్‌పై యుద్ధం సాగిస్తున్న రష్యాపై పశ్చిమ దేశాలు ఆంక్షలు విధించిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ మాస్కో నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడంపై అప్పట్లో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. దీనిపై భారత్ ఎప్పటికప్పుడు స్పష్టతనిస్తూనే ఉంది. తాజాగా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి దీనిపై మరోసారి స్పందించారు. రష్యా చమురును ఎన్నడూ ఆంక్షల పరిధిలోకి తీసుకురాలేదు. కేవలం దాని ధరపై మాత్రమే పరిమితి విధించారు. ప్రపంచ చమురు సరఫరా గొలుసు ఎలా ఉంటుందన్న వాస్తవం చాలామందికి తెలుసు. రష్యా నుంచి డిస్కౌంట్లో వచ్చిన చమురును భారత్ కొనుగోలు చేయడం వల్ల ప్రపంచ మార్కెట్లకు మేలే జరిగింది. లేదంటే చమురు ధరల మోత మోగేదని పురి అన్నారు. సాధారణంగా రష్యా రోజుకు 9 మిలియన్ బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేస్తోంది. ప్రపంచంలోని అతిపెద్ద ముడిచమురు ఉత్పత్తిదారుల్లో మాస్కో ఒకటి. ఇక, ప్రపంచవ్యాప్తంగా రోజుకు 97 మిలియన్ బ్యారెళ్ల చమురు సరఫరా అవుతోంది. ఆంక్షల కారణంగా ఇందులో 9 మిలియన్ బ్యారెళ్ల సరఫరా ఒక్కసారిగా ఆగిపోతే.. ప్రపంచ వినియోగంలో 10శాతం తగ్గించుకోవాల్సి వస్తుంది. అది అసాధ్యం. అప్పుడు సరఫరా తగ్గడంతో బ్యారెల్ చమురు ధర 120-130 డాలర్లకు పెరిగేదని కేంద్రమంత్రి వివరించారు. ఎనర్జీ మార్కెట్‌ను అర్థం చేసుకోలేనివారే ఇలాంటి అంశాలపై మాట్లాడతారని ఆయన దుయ్యబట్టారు.


# అహంకారమే పతన హేతువు!

**(ఆధ్యాత్మిక చింతన )**

ప్రతి వ్యక్తీ గొప్పవాడు కావాలని కలలు కంటుంటాడు. కొందరు విశేషంగా ధనం సంపాదించి, తాము గొప్పవారమనే భ్రమతో గర్విస్తారు. మరికొందరు హోదా లభించగానే అధికార దర్పం, అహంకారం ప్రదర్శిస్తారు. ఇది సహజం. కానీ, అందరికన్నా గొప్పవాడు కావాలని కొందరు ఆరాటపడతారు. అలా కావటానికి చేతనైన అన్ని రకాల విధానాలూ అనుసరిస్తారు. అడ్డదారులు తొక్కుతారు. అవినీతికి సిద్ధపడతారు. అనాయాసంగా, నిస్సంకో చంగా అబద్దాలు ఆడతారు. ఇది కూడా ఆధిక్యతాభావం వల్లనే! కొందరు తమకంటే అందరూ తక్కువ స్థాయిలోనే ఉండాలని కోరుకుంటారు. తమకన్నా ఎవరు మించిపోతున్నా భరించలేరు. అసూయతో కుమిలిపోతారు. వారిమీద కక్షగా ఉంటారు. అవకాశం లభిస్తే, ఏదో విధంగా, తమకన్నా అధికులకు అపకారం చేస్తారు. వారికి కష్టనష్టాలు కలిగినప్పుడు, లోలోపల సంతోషపడుతూ, పైకి కపట సానుభూతి ప్రకటిస్తారు. దుర్యోధనుడికి సుయోధనుడు అనే మరొక పేరు ఉంది. నిజానికి అతడు అసూయాధనుడు. పాండవుల ఔన్నత్యాన్ని, ఆధిక్యతను సహించలేక పోతుండేవాడు. బాల్యం నుంచే పాండవుల పట్ల అసూయ, ద్వేషం కలిగి ఉండేవాడు. అసూయ అగ్ని వంటిది. ద్వేషమూ అంతే. ఏ కర్ర నిప్పు ఆ కర్రనే కాల్చినట్టు, ఎవరు అసూయాపరులో, వారినే అసూయాద్వేషాలు దహిస్తాయి. ఇది నిత్య సత్యం.

# కొత్త పుంతలు తొక్కుతున్న ఆవిష్కరణలు

## జపాన్‌లో అద్భుత ఇంటర్నెట్ ఆవిష్కరణ




**టోక్యో :** ఆవిష్కరణలు కొత్త పుంతలు తొక్కుతున్నాయి. ఎప్పుడు ఎలాంటి ఆవిష్కరణలు వస్తాయో చెప్పలేని పరిస్థితి. ఏఐతో ప్రపంచం అంతా మారిందనుకుంటున్న వేళ అన్నింటా అద్భుతాలు ఆవిష్కృతం అవుతున్నాయి. బుల్లెట్ రైళ్లు, అత్యుత్తమ ఎయిర్‌పోర్టులు చూస్తున్నాం. రోబోలతో మొత్తం ప్రపంచ గతి మారుతోంది. వైద్యరంగంలోనూ ఆవిష్కరణలుకొత్త పుంతలు తొక్కిస్తున్నాయి. ఈ క్రమంలో అధునాతన సదుపాయాల్లో ముందుండే జపాన్ ఇప్పుడు మరో అద్భుతాన్ని ఆవిష్కరించింది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఇంటర్నెట్‌ను ఆ దేశ పరిశోధకులు అభివృద్ధి చేశారు. సెకనకు 1.02 పెటాబిట్స్ స్పీడ్‌తో పనిచేసే ఈ ఇంటర్నెట్‌తో.. కేవలం రెప్పపాటులో నెట్‌ఫ్లిక్స్ లైబ్రరీలో ఉన్న డేటా మొత్తాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని నిరూపించారు. అమెరికాలో ఉన్న సగటు ఇంటర్నెట్ కనెక్షన్ల కంటే ఇది 3.5 మిలియన్ రెట్ల వేగవంతమైనదని అంటున్నారు. ప్రత్యేక ఫైబర్ ఆప్టిక్ కేబుల్ సాయంతో జపాన్ ఈ వేగవంతమైన నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసింది. ఇందుకోసం పరిశోధకులు ట్రాన్స్‌మిటర్లు, రిసీవర్లు, 19 లూపింగ్ సర్క్యూట్లను వినియోగించారు. ఈ లూపింగ్ సర్క్యూట్ ఒక్కోటి 86.1 కిలోమీటర్ల పొడవు ఉంది. ఈ లూప్స్ నుంచి సిగ్నళ్లు వెళ్లి డేటాను అందిస్తాయి. దీని సాయంతోనే సెకనుకు 1808 కిలోమీటర్ల దూరం వరకు డేటాను పంపించేందుకు వీలు లభిస్తుందని తెలిపింది. ప్రస్తుతానికి ఈ ఇంటర్నెట్ గృహ వినియోగదారులకు అందుబాటులోకి వచ్చే అవకాశాలు కన్పించట్లేదు. ప్రభుత్వాలు, డేటా సెంటర్ ఆపరేటర్లు, టెలికాం సంస్థలు దీన్ని వినియోగించుకునేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 6జీ నెట్‌వర్క్, తర్వాతితరం సముద్రగర్భ కేబుళ్లకు ఈ జపాన్ ఇంటర్నెట్ ఓ మోడల్‌గా నిలవనుంది. జపాన్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ తమ వెబ్‌సైట్‌లో పేర్కొంది. ఇక భారత్‌లోని సగటు ఇంటర్నెట్ స్పీడ్‌తో పోలిస్తే దీని బ్రౌజింగ్, డౌన్‌లోడింగ్ వేగం 16 మిలియన్ రెట్లు ఎక్కువని తెలిపింది. ఎన్ఐసీటీలోని ఫొటోనిక్ నెట్‌వర్క్ లాబోరేటరీ టీమ్, సుమితోమో ఎలక్ట్రిక్ అండ్ యూరోపియన్ పార్ట్‌నర్స్‌తో కలిసి జపాన్ ఈ ఇంటర్నెట్‌ను అభివృద్ధి చేసింది. ఈ ఇంటర్నెట్‌తో కేవలం ఒక్క సెకనులోనే ఇంగ్లీష్ వికీపిడియా మొత్తాన్ని 10వేల సార్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆ వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. సాధారణంగా ఈ వికీపిడియా స్టోరేజీ 100 జీబీ వరకు ఉంటు-ంది. ఇక, కొత్త ఇంటర్నెట్‌తో ఒక్క సెకనులోనే 8కే రిజల్యూషన్‌తో ఉన్న వీడియోలను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని జపాన్ పరిశోధకులు చెబుతున్నారు.




## తమన్ స్టూడియోలో ప్రభాస్ సందడి

### రాజాసాబ్సాంగ్స్ కంపోజింగ్‌పై ఆసక్తి

రెబల్ స్టార్ ప్రభాస్, మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న సినిమా 'ది రాజా సాబ్'. హార్రర్, కామెడీ, రొమాంటిక్ కథాంశంతో రానున్న ఈ సినిమాలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిధిలు హీరోయిన్లుగా నటిస్తున్నారు. థమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను పీపుల్స్ మీడియా ఫ్యాక్టరి బ్యానర్ పై విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతుంది. తాజాగా రెబల్ స్టార్ ప్రభాస్ తమన్ మ్యూజిక్ సిట్టింగ్స్ లో దిగిన ఫోటో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అయితే తమన్ అందించిన సాంగ్స్ ప్రభాస్ కు నచ్చలేదని అందుకే స్వయంగా డార్లింగ్ దిగాడని కెమెంట్స్ చేస్తున్నారు ఫ్యాన్స్. వాస్తవానికి రాజాసాబ్ సినిమాకు తమన్ ఎప్పుడో సాంగ్స్ కంపోజ్ చేసి ఇచ్చేసాడు. అందులో కొన్ని సాంగ్స్ ను షూట్ కూడా చేసారు. ఆ తర్వాత స్కిప్ట్ లో వచ్చిన కొన్ని మార్పుల కారణంగా ముందు కంపోజ్ చేసిన సాంగ్స్ అన్నిటిని పక్కన పెట్టేసారు. ఇప్పుడు మరలా తమన్ తో సాంగ్స్ ను కంపోజ్ చేపిస్తున్నారు. తమన్ అందుకోసం వర్క్ స్టార్ట్ చేసాడు. ఈ నేపథ్యంలోనే తమన్ స్టూడియోకు ప్రభాస్ వెళ్లి సరదాగా కాసేపు ఉండి వచ్చాడు. అంతే తప్ప వర్క్ నచ్చక కాదు. తమన్ సాంగ్స్ ఫినిష్ చేసాక సాంగ్స్ షూట్ చేసేందుకు షెడ్యూల్ ఎ÷-లాన్ చేస్తున్నారు మేకర్స్. తమన్ వర్క్ పట్ల మారుతీ చాలా అండ్ టీ-మ్ హ్యాపీ గా ఉన్నారు. జెట్ స్పీడ్ లో జరుగుతున్న రాజాసాబ్ ఈ ఏడాది డిసెంబర్ 5న థియేటర్స్ లో అడుగుపెట్టనున్నాడు.



## పెళ్లంటే జీవితకాలపు బాధ్యత

### నటి శృతిహాసన్ ఆసక్తికర విషయాలు వెల్లడి

తన వ్యక్తిగత విషయాల గురించి ఎప్పుడూ అభిమానులతో పంచుకునే నటి శ్రుతి హాసన్ పెళ్లి విషయంలోనూ ఆసక్తికర విషయాలను వెల్లడించారు. పెళ్లిపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. వివాహం అనే ఆలోచన కూడా తనకు భయాన్ని కలిగిస్తుందన్నారు. నాకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడానికి జీవితమంతా కష్టపడ్డాను. ఆ గుర్తింపును ఓ కాగితం ముక్కతో ముడిపెట్టాలనే ఆలోచన కూడా భయంకరంగా అనిపిస్తుంటుంది. వివాహ బంధాన్ని.. ఆ వ్యవస్థలో ఉన్న విలువలను నేను గౌరవిస్తాను. కానీ, వాటిని ధ్రువీకరించడానికి ఓ చట్టపరమైన కాగితం అవసరం లేదని నా అభిప్రాయం. నా జీవితంలో ఒకసారి నేను వివాహానికి చాలా దగ్గరగా వెళ్లాను. కానీ, అది ముడి పడలేదు. ఇద్దరు మనుషులు ఒక్కటవ్వాలంటే వారి అభిప్రాయాలు కలవాలి. అయినా, పెళ్లి అనేది ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన విషయం కాదు. అది జీవితకాలపు బాధ్యతని అన్నారు. మరికొన్ని రోజుల్లో 'కూలీ'తో పలకరించనున్న ఆమె.. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయాలు వెల్లడించారు. రజనీకాంత్‌తో కలిసి వర్క్ చేసిన అనుభవంతో పాటు తన కెరీర్ గురించి మాట్లాడారు. పవన్ కల్యాణ్ హీరోగా వచ్చిన 'గబ్బర్ సింగ్'లో అవకాశం వచ్చినప్పుడు కొన్ని కారణాల వల్ల నేను నటించలేనని చెప్పాను. హరీశ్ శంకర్ నన్ను ఒప్పించారు. ఆ పాత్రలో నన్ను కాకుండా మరో నటిని ఊహించుకోలే నన్నారు. కానీ, ఆ సినిమా నా కెరీర్ మొత్తాన్ని మార్చేసింది. నేను నటించిన ఎన్నో సినిమాలు మంచి సక్సెస్‌ను సాధించినప్పటికీ తొలి విజయాన్ని ఇచ్చింది మాత్రం తెలుగు పరిశ్రమే. పవన్ ఎప్పుడూ వ్యవసాయం గురించి, గ్రామీణ ప్రాంతాల్లో ఉండే వారి గురించే మాట్లాడుతుండేవారు. ఆయనకు రాజకీయ రంగం కూడా సరిపోతుంది.మా నాన్న, రజనీకాంత్ ఇద్దరూ తమిళ ఇండస్ట్రీకి రెండు కళ్ల లాంటి వాళ్లు. రజనీకాంత్ సూపర్ స్టార్. ఇన్ని రోజులు మా నాన్న దృష్టికోణంలోనే ఆయన నాకు తెలుసు. 'కూలీ' సినిమాలో ఆయనతో వర్క్ చేస్తున్నప్పుడు పూర్తిగా తెలుసుకున్నాను. సెట్‌లో ఎంతో యాక్టివ్‌గా ఉంటారు. తన చుట్టూ ఉండేవాళ్లు కూడా సంతోషంగా ఉండాలని కోరుకుంటారు. ఆయన ఎనర్జీకి ఎవరూ సరితూగరు. ఆయనతో కలిసి నటించే అవకాశం వచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇండస్ట్రీలో ఎంతోమంది గొప్ప నటులు ఉన్నారు. ఎవరి ప్రత్యేకతలు వారికి ఉంటాయి. అమితాబ్ బచ్చన్ , కమల్ హాసన్, రజనీకాంత్.. వీరందరినీ ఒకరితో ఒకరిని పోల్చలేం అని శ్రుతి వివరించారు.



## రేణూదేశాయ్ సర్జరీ గురించి నెట్టింట ఆసక్తి

2009లో పవన్ కల్యాణ్‌ను ప్రేమ వివాహం చేసుకున్న రేణు దేశాయ్, అకీరా నందన్, ఆద్య అనే ఇద్దరు పిల్లలకు తల్లయ్యారు. 2012లో వీరి వివాహ బంధానికి బీటలు వారాయి.. విడాకుల అనంతరం రేణు సినిమాలకు కూడా దూరమయ్యారు. అప్పటినుంచి తల్లిగా తన పాత్రను పోషిస్తూ పిల్లలకే ప్రత్యేక సమయం కేటాయించారు. అయితే రేణూ దేశాయ్‌కి సంబంధించిన ఓ వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. రేణూ దేశాయ్ తాజాగా తన ఇన్‌స్టా స్టోరీలో కూతురు ఆద్యతో దిగిన పిక్ షేర్ చేస్తూ.. సర్జరీ తర్వాత నా ముద్దుల కూతురితో కలిసి డిన్నర్ డేట్‌కి బయటకు వెళ్లాను అంటూ క్యాప్షన్ జోడించింది. దీంతో ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. ఈ పోస్ట్ తర్వాత రేణూ దేశాయ్‌కి సర్జరీ జరగడమేంటి, ఆమెకు ఏమైందని ఫ్యాన్స్ ఆందోళన చెందుతున్నారు. ఇక రేణూ దేశాయ్ దాదాపు 20 ఏళ్ల విరామం తర్వాత రవితేజ నటించిన 'టైగర్ నాగేశ్వరరావు' సినిమాలో నటించారు. హేమలత లవణం పాత్రలో కనిపించినా.. ఆ సినిమా ఫెయిల్ కావడంతో ఆమె మళ్లీ సినిమాలపై ఆసక్తి చూపడం లేదు. రేణు దేశాయ్ ఇప్పుడు జంతు హక్కుల కోసం పోరాడుతున్న ప్రముఖ సామాజిక కార్యకర్తగా మారారు. మూగజీవాల సంక్షేమానికి సొంతగా ఎన్జీవో కూడా ప్రారంభించారు. ఈ సంస్థకు ఉపాసన కొణిదెల అంబులెన్స్ సదుపాయం అందించడం విశేషం. ఇక ఇదిలా ఉంటే రేణ ఇటీవల రెండో పెళ్లిపై ఓపెన్ అయింది. అకీరా, ఆద్యే నన్ను పెళ్లి చేసుకోమని ప్రోత్సహిస్తున్నారు. నువ్వు ఎవరితో హ్యాపీగా ఉంటావో వాళ్లని పెళ్లి చేసుకో అంటున్నారు. మరో రెండేళ్లో నా పిల్లలకి పూర్తి అవగాహన వస్తుంది. అప్పుడు తప్పకుండా ఓ వ్యక్తిని పెళ్లి చేసుకుంటానని పేర్కొంది రేణూ.



## సర్దార్ 2 25న విడుదల

2012లో ప్రేక్షకుల ముందుకు వచ్చి నవ్వులు పంచిన సినిమా 'సన్ ఆఫ్ సర్దార్'కి కొనసాగింపుగా తెరకెక్కిన చిత్రం 'సన్ ఆఫ్ సర్దార్ 2'. అజయ్ దేవగణ్, మృణాల్ ఠాకూర్ ప్రధానపాత్రల్లో నటించిన ఈ సీక్వెల్ జులై 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా టీమ్ దీని ట్రైలర్‌ను విడుదల చేసింది. పంజాబీ అమ్మాయిగా సర్దార్‌తో కలిసి నవ్వులు పంచుతోంది మృణాల్. విజయ్ కుమార్ అరోరా దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సంజయ్ దత్ కీలక పాత్రలో కనిపించనున్నారు.



## సాయిపల్లవి సీతకి సరిపోదంటూ విమర్శలు

ఇండియన్ సినిమా హిస్టరీలో భారీ బడ్జెట్ తో రాబోతోంది రామాయణ మూవీ. రణ్ బీర్ కపూర్ రాముడిగా, యష్ రావణుడిగా, సాయిపల్లవి సీతగా కనిపిస్తున్నారు. నితేష్ తివారీ డైరెక్షన్ లో వస్తోంది. దాదాపు రూ.900 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమాను బాలీవుడ్ నిర్మాతలతో కలిసి అల్లు అరవింద్ నిర్మిస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉంది. కానీ సాయిపల్లవిని పనిగట్టుకుని కొందరు నార్త్ యూట్యూబ్ ఛానెళ్లు, కొందరు బాలీవుడ్ మీడియా వాళ్లు ట్రోల్స్ చేస్తున్నారు. సాయిపల్లవి సీత పాత్రకు సరిపోదంటూ తెగ పోస్టులు పెడుతున్నారు. కాజల్ రావణుడి భార్యగా, రకుల్ శూర్పనకగా నటిస్తున్నారంటూ ఒక ప్రచారం అయితే

నడుస్తోంది. దీంతో కాజల్ లాంటి అందమైన భార్య ఉండగా రావణుడు అందంగా లేని సాయిపల్లవి కోసం పరితపించడం ఏంటని వెకిలి పోస్టులు పెట్టేస్తున్నారు. పైగా గో వధ చేసే వారిపై గతంలో సాయిపల్లవి సానుభూతి చూపించింది కాబట్టి ఆమెను సీత పాత్రకు తీసుకోవడం ఏంటని ట్రోల్స్ చేస్తున్నారు. కానీ సాయిపల్లవి సీత పాత్రకు న్యాయం చేస్తుందని ఆమె ఫ్యాన్స్ అంటున్నారు. ఎందుకంటే సీతమ్మ పాత్రలో చేయాలంటే అద్భుతమైన నటన వచ్చి ఉండాలని.. అది సాయిపల్లవికే ఉందంటున్నారు. పైగా ఇతర హీరోయిన్లలాగా సాయిపల్లవి ఎలాంటి ఎక్స్ పోజింగ్, బోల్డ్ పాత్రలు చేయలేదని.. కాజల్, రకుల్ అలాంటి పాత్రలు చేశారని చెబుతున్నారు. సీతమ్మ పాత్రలో చేయడానికి ఉండాల్సిన అన్ని అర్హతలు సాయిపల్లవికి ఉన్నాయంటున్నారు. అందం ముఖ్యం కాదని.. అభినయమే ముఖ్యం అంటూ ఆమెకు మద్దతు ఇస్తూ నార్త్ మీడియాను ఏకి పారేస్తున్నారు.

## 18నుంచి అమెజాన్ ప్రైమ్‌లోకి కుబేర

శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ధనుష్, నాగార్జున, రష్మిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కుబేర' ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా జులై 18 నుంచి స్ట్రీమింగ్ కానుంది. గత కొన్ని రోజులుగా దీని ఓట టీ- విడుదలపై ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటికి చెక్ పెడుతూ.. తాజాగా ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తూ అమెజాన్ ఓ పోస్టర్ విడుదల చేసింది. దేశంలోనే అత్యంత సంపన్నుడైన గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ సీఈవో నీరజ్ మిత్ర (జిమ్ సర్ఫ్) ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడిగా నిలవాలని కలలు కంటుంటాడు. ఆ కల కోసం ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సాగర్ ప్రాజెక్ట్‌ను వినియోగించుకోవాలనుకుంటాడు. రూ.లక్ష కోట్ల డీల్ కుదుర్చుకుంటాడు. ఆ మొత్తం డబ్బులో రూ.50 వేల కోట్లు బ్లాక్‌లో.. మిగిలిన డబ్బు వైట్‌లో ఇవ్వాలని నీరజ్‌కు సిద్ధప్ప షరతు విధిస్తాడు. ఈ పనిని సమర్థంగా చేయడం కోసం జైల్లో ఉన్న మాజీ సీబీఐ అధికారి దీపక్ తేజ్ (నాగార్జు)ను బయటకు తీసుకొస్తాడు. ఈ పని కోసం దీపక్ బిచ్చగాళ్లను ఎంచుకుంటాడు. ఈ పని పూర్తి కాగానే ఆ నలుగురు బిచ్చగాళ్లను చంపేయాలని నీరజ్ ప్లాన్ చేయగా.. వారిలో ఒకడైన దేవా (ధనుష్) తప్పించుకుంటాడు. మరి వీళ్ల చేతికి దేవా దొరికాడా? తన ఖాతాలో ఉన్న వేల కోట్ల డబ్బును దేవా ఏం చేశాడన్నది మిగిలిన కథ. శేఖర్ కమ్ముల మూవీ కావడంతో ఆసక్తి పెరిగింది. అయితేఅనుకున్నంతగా ఇది సక్సెస్ సాధించలేదన్నది వేరు విషయం.




Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463